01ATP26F.qxd:01ATP26F.qxd 27/06/26 11:41 PM Page 1






అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 27 జూన్ 2026 పేజీలు : 04


# కళ్యాణదుర్గం తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక అడుగు

## రూ.178.74 కోట్లతో ఇంటింటికీ కుళాయి పథకానికి శ్రీకారం

### 2027 డిసెంబర్ నాటికి 12 వేల కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీరు - ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



కళ్యాణదుర్గం శాశ్వత తాగునీటి పథకానికి భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు.

**కళ్యాణదుర్గం, జూన్ 26 ప్రభాతవార్త**

ఎన్నో ఏళ్లుగా తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్న కళ్యాణదుర్గం మున్సిపాలిటీ ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రూ.178.74 కోట్ల వ్యయంతో అమలు కానున్న శాశ్వత తాగునీటి పథకానికి శుక్రవారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో జిందాల్ సంస్థ ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సాగు, తాగునీటి రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు భారీ తాగునీటి పథకాలను చేపడుతోందని, ఆ దిశలో కళ్యాణదుర్గం పథకం అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మున్సిపాలిటీలోని సుమారు 12 వేల కుటుంబాలకు ఇంటింటికీ ఉచిత కుళాయి కనెక్షన్లు అందించబడతాయని తెలిపారు. మహిళలు నీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రతి ఇంటికి నాణ్యమైన తాగునీరు చేరే విధంగా ఆధునిక పైపులైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. 2027 డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఎలాంటి ఆలస్యం లేకుండా పనులను వెంటనే ప్రారంభిస్తున్నామని, పైపులైన్ నిర్మాణ సమయంలో దెబ్బతినే సీసీ రోడ్లను కూడా నిర్మాణ సంస్థ ద్వారానే పునరుద్ధరించేలా ఆదేశాలు ఇచ్చామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పథకం అమలుతో రాబోయే 20 సంవత్సరాల వరకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలపై స్పందిస్తూ, రాష్ట్రంలో సాగు, తాగునీటి ప్రాజెక్టులతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రాంతీయ అభివృద్ధిలో భాగంగా విద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక రంగాల విస్తరణకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. బీటీపీ ప్రాజెక్టును 2028 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, ప్రతి నెల ఒకటో తేదీన సామాజిక భద్రత పింఛన్లు, ఉద్యోగులకు జీతాలు చెల్లించడం ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే నిర్ణయం లక్షలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు. త్వరలోనే కొత్త పింఛన్లు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, కళ్యాణదుర్గం తాగునీటి పథకం గతంలో రాజకీయ కారణాలతో నిలిచిపోయిందని ఆరోపించారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పథకాన్ని కార్యరూపంలోకి తీసుకువచ్చిందని చెప్పారు. కళ్యాణ దుర్గం వంటి కరువు ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంలో ఈ పథకం కీలకంగా నిలవనుంది. కేవలం పైపులైన్ల నిర్మాణమే కాకుండా, భవిష్యత్ జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపకల్పన చేసిన ఈ ప్రాజెక్టు పట్టణాభివృద్ధికి బలమైన పునాది వేయనుంది. స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడం ద్వారా ప్రజారోగ్యం మెరుగుపడటంతో పాటు నీటి కోసం వెచ్చించే సమయం, ఖర్చు కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రూ.178.74 కోట్లతో చేపట్టిన ఈ పథకం కళ్యాణదుర్గం అభివృద్ధి చరిత్రలో ఒక కీలక మైలు రాయిగా నిలవనుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# కేంద్ర ప్రభుత్వ పురస్కార గ్రహీత ఎద్దుల సూర్యనారాయణ రెడ్డికి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఘన సన్మానం

**అనంతపురం, జూన్ 26 ప్రభాత వార్త బ్యూరో**

కేంద్ర ప్రభుత్వ పురస్కారం అందుకున్న అనంతపురం జిల్లా పెద్దవడుగూరు గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులు, ప్రముఖ సిపిఐ నాయకులు ఎద్దుల సూర్యనారాయణ రెడ్డిని ఢిల్లీలోని ఇంద్రజిత్ గుప్త మార్గ్లో ఉన్న అజయ్ భవన్లో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ.. 92 ఏళ్ల వయస్సులో కూడా సూర్యనారాయణ రెడ్డి ఎంతో చురుకుగా ఉండటం ఆనందదాయకమని అన్నారు. సిపిఐ పార్టీకి ఎనలేని సేవలు అందించడంతో పాటు సమాజ సేవలో నిరంతరం పాల్గొంటూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం అందించిన పురస్కారం ఆయన జీవితకాల సేవలకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కె. రామకృష్ణ, అఖిల భారత స్వాతంత్ర సమరయోధుల వారసుల సంఘం జాతీయ కార్యదర్శి రాంపిళ్ల జయప్రకాశ్, గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విజయభాస్కర్, ఢిల్లీ సామాజిక కార్యకర్త గురుదేవ్ తదితరులు పాల్గొని ఎద్దుల సూర్యనారాయణ రెడ్డికి అభినందనలు తెలియజేశారు.



సూర్యనారాయణ రెడ్డిని సన్మానిస్తున్న సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

# ముగ్గురు సీఎంల కలయిక చరిత్రలో నిలిచిపోతుంది

### - తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభంలో జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు





తుంగభద్ర కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే ప్రసాద్, కేంద్ర మంత్రితో ఎమ్మెల్యే

**అనంతపురం క్రైమ్ జూన్ 26 ప్రభాతవార్త**

మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ.. మూడు రాష్ట్రాల రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు నాంది పలికిందని.. మంత్రులు, అనంతపురం జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రం హోసపేటలో జరిగిన తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, ఎంపీలు, అంబికా లక్ష్మినారాయణ, పార్థసారథి, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కాల్వ శ్రీనివాసులు, జయరాం, సురేంద్రబాబులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబుకు వీరంతా స్వాగతం పలికారు. తుంగభద్ర ప్రాజెక్టుకు కొత్తగా అమర్చిన గేట్ల ప్రారంభం చారిత్రాత్మక ఘట్టమని, ఇది ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల రైతులకు ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక సీఎం డీకే శివకుమార్ తెలంగాణ సీ ఎం రేవంత్ రెడ్డి, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసి డ్రైవర్‌పై దాడి

### - వివాహేతర సంబంధమే కారణమా ?

**పెద్దపప్పూరు(తాడిపత్రిఅర్బన్), జూన్ 26 ప్రభాతవార్త**



గాయపడిన వెంకటనారాయణ

పెద్దపప్పూరు మండలంలోని వరదాయపల్లి గ్రామానికి చెందిన వెంకటనారాయణ అనే ఆర్టీసి డ్రైవర్‌పై అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. వివరాలు ఇలా ఉన్నాయి. వరదాయపల్లి గ్రామానికి చెందిన వెంకటనారాయణ తాడిపత్రి ఆర్టీసి డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన ఒక మహిళతో వెంకటనారాయణ వివాహేతర సంబంధం కలిగి ఉండడంతో మనస్పర్థలు నెలకొన్నాయి. శుక్రవారం వరదాయపల్లి గ్రామం నుంచి ముచ్చుకోట వైపు వస్తుండగా మధ్య మార్గంలో కొంతమంది యువకులు వెంకటనారాయణను అడ్డగించి కర్రలు రాళ్లతో దాడి చేశారు. వారి దాడి నుంచి వెంకటనారాయణ తప్పించుకొని గ్రామం వైపు పరుగులు తీశాడు. గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు అదే రోడ్డుపై వస్తూ వెంకటనారాయణను గమనించడంతో దాడి చేసిన వారు పరారయ్యారు. దాడిలో తీవ్రంగా గాయపడిన వెంకటనారాయణను చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామసుబ్బయ్య పేర్కొన్నారు. దాడి చేసిన వ్యక్తుల్లో ఒకరిని పోలీసులు అదుపుగా తీసుకొని విచారిస్తున్నారు. మహిళతో ఉన్న వివాహేతర సంబంధం కారణంగా దాడి చేశారని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

# తాడిపత్రిలో ప్రత్యేక రాజ్యాంగం నడుస్తోందా..!

### - వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత
### - తాడిపత్రికి వెళ్లకుండా వైసిపి శ్రేణులను అడ్డుకున్న పోలీసులు
### - రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేసిన వైసిపి శ్రేణులు



వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిని తరలిస్తున్న పోలీసులు



వైసిపి జిల్లా కార్యాలయం నుంచి బయటికి రాకుండా నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

**అనంతపురం సిటీ, జూన్ 26 ప్రభాతవార్త**

తాడిపత్రిలో ప్రత్యేక రాజ్యాంగం ఏమైనా నడుస్తోందా అని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పోలీసుల తీరుపై మండి పడ్డారు. తాడిపత్రిలో టీడీపీ మూకలు వైసిపి నాయకులపై చేసిన దారుడలను నిరశిస్తూ తాడిపత్రి గాంధీ విగ్రహం ఎదుట చేపట్టిన సామూహిక దీక్షకు వెళ్లేందుకు వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నేతలు సన్నద్ధం అయ్యారు. వైసిపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డితోపాటు పెద్ద ఎత్తున పార్టీ నేతలు శ్రేణులు సమావేశం అయ్యారు. అక్కడి నుంచి తాడిపత్రికి వెళ్లేందుకు సిద్ధం కాగా కార్యాలయం గేటు ఎదుట పోలీసులు బారికేట్లు పెట్టి వారిని నిలువరించేప్రయత్నం చేశారు. పోలీసు ఆంక్షలు, బారికేట్లను తొలగించుకుని బయటికి వచ్చిన జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రత్యేక వాహనంలో కోర్టు రోడ్డులోని అనంత వెంకటరామిరెడ్డి నివాసానికి తరలించారు. అయితే పోలీసుల తీరును నిరసిస్తూ కోర్టు రోడ్డు ప్రధాన రహదారిపై జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి పార్టీ నేతలతో కలిసి రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో తాడిపత్రి నియోజకవర్గం లేదా, తాడిపత్రికి వెళ్లేందుకు ఇన్ని ఆంక్షలు ఎందుకంటూ పోలీసుల తీరును ప్రశ్నించారు. 43 ఏళ్ల నా రాజకీయ జీవితంలో పోలీసులు ఇంతగా దిగజారిన తీరును తొలిసారిగా చూస్తున్నానని మండి పడ్డారు. తాడిపత్రిలో మట్కా, గంజాయి విచ్చల విడిగా జరుగుతోందని వాటిని అడ్డుకోవడంలో పోలీసులు విఫలం అయ్యారని విమర్శించారు. తాడిపత్రిలో జెసి అనుచరులు పోలీసులను అడ్డుపెట్టుకుని దౌర్జన్యాలు చేస్తున్నారని మండి పడ్డారు. సీఎం చంద్రబాబు అండతోనే తాడిపత్రిలో అసాంఘీక శక్తులు రెచ్చిపోతున్నాయని విమర్శించారు. తాడిపత్రిలో అసాంఘీక కార్యకలాపాలను అడ్డుకట్ట వేసే ధైర్యం చంద్రబాబుకు లేదా అని ఆయన ప్రశ్నించారు. తాడిపత్రిలో వైసిపి నాయకులపై పోలీసుల సమక్షంలోనే దాడులు జరుగుతున్నా పోలీసులు వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. మరోవైపు జెసి ప్రభాకర్‌రెడ్డి మా ఇళ్ల వద్దకు వస్తామని బెదిరిస్తున్న మాటలు ఎస్పీకి వినపడం లేదా అని ఆయన ప్రశ్నించారు. అప్రజాస్వామిక విధానాలు, టిడిపి దాడులపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమంగా మారుస్తామని మా పోరాటం ఇక ఆగదని ఆయన హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాడిపత్రిలో పెద్దారెడ్డి ఇంటి చుట్టూ ముళ్లకంచ చుట్టూ ఇళ్ల కంచె వేసి పోలీసులు అడ్డుకుంటున్నారని, తాడిపత్రిలో ప్రత్యేక ప్రతిపత్తి, ప్రత్యేక రాజ్యాంగం ఉందా అని ప్రశ్నించారు. తాడిపత్రిలో ప్రజాస్వామిక విధానాలపై పోరాడుతున్నామని కట్టడి చేయాల్సింది దాడులు చేస్తున్నవారిపై కాకుండా మాపై పోలీసులు కట్టడి చేస్తున్నారని విమర్శించారు. తాడిపత్రిలో ప్రజాస్వామ్య పరిరక్షణకు వైసిపి పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని అక్కడి నుంచి తన నివాసానికి తరలించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైఎస్ఆర్‌సిపి ముఖ్య నేతలు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు.



పోలీసుల తీరుకు నిరసనగా రోడ్డుపై బైటాయించిన వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత, నేతలు

# గూగూడు బ్రహ్మోత్సవాల్లో జిల్లా ఎస్పీ

### బ్రహ్మోత్సవాల బందోబస్తును సమీక్షించిన ఎస్పీ



భక్తుల రద్దీపై సూచనలిస్తున్న ఎస్పీ జగదీష్



స్వామి వద్ద క్యూను పరిశీలిస్తున్న దృశ్యం



పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న ఎస్పీ

**అనంతపురం క్రైమ్ జూన్ 26 ప్రభాతవార్త**

ప్రసిద్ధి గాంచిన గూగూడు శ్రీ కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రధాన ఘట్టమైన "పెద్ద సరిగెత్తె" లో జిల్లా ఎస్పీ పి.జగదీష్ పాల్గొన్నారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో బందోబస్తును క్షుణ్ణంగా సమీక్షించారు. ఉత్సవాలకు భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఎస్పీ స్వయంగా ఆలయ పరిసర ప్రాంతాలలో పర్యటించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, తోపులాటలు జరగకుండా క్యూలైన్లను క్రమబద్ధీకరించాలని సిబ్బందిని ఆదేశించారు. స్వామివారి దర్శనం సజావుగా సాగేలా చర్యలు చేపట్టారు.

**ట్రాఫిక్ పార్కింగ్ :**

ఉత్సవాలకు వచ్చే వాహనాల వల్ల ట్రాఫిక్ జామ్ కాకుండా కేటాయించిన పార్కింగ్ స్థలాలను, అక్కడ వాహనాల క్రమశిక్షణను పరిశీ లించారు.

**కమాండ్ కంట్రోల్ రూమ్ :**

ఆలయ పరిసరాలలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల నిఘాను, కమాండ్ కంట్రోల్ రూమ్ పనితీరును పరిశీలించి, ప్రతి కదలికపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు.

**డ్రోన్ ద్వారా సమీక్ష :**

గూగూడు బ్రహోత్సవాలలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎస్పీ స్వయంగా డ్రోన్ల ద్వారా పర్యవేక్షించారు. క్షేత్రస్థాయిలో విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది అలసత్వం వహించకుండా, భక్తులతో మర్యాదగా ప్రవర్తిస్తూ శాంతిభద్రతలను కాపాడాలని ఎస్పీ స్పష్టం చేశారు. భక్తుల భద్రతే మా మొదటి ప్రాధాన్యత. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో ముగిసేలా పోలీస్ శాఖ అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంది. భక్తులు కూడా పోలీసులకు సహకరించాలన్నారు. జిల్లా ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ ఎం.నాగభూషణం, శింగనమల సి.ఐ రాగిరి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15లోగా బృగతీర్థం పనులు పూర్తి చేస్తాం

### - నియోజకవర్గ అభివృద్ధికి కెపిఎంజి సంస్థతో ఒప్పందం: ఎమ్మెల్యే కందికుంట



సంస్థ ప్రతినిధులతో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఎమ్మెల్యే కందికుంట

**కదిరి, జూన్ 26 ప్రభాతవార్త**

ప్రముఖ ప్రసిద్ధి గాంచిన ఖాద్రి లక్ష్మినరసింహస్వామి బృగ తీర్థం పనులను ఆగస్టు 15లోగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీం కింద ఆగమశాస్త్ర ప్రకారం శ్రీమత్‌ఖాద్రి లక్ష్మినరసింహస్వామి ఆలయ సుందరీకరణకు చేయాల్సిన అభివృద్ధి పనులపై పుర ప్రజల పెద్దలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కెపిఎంజి సంస్థ నిర్వహించిన పవర్ ప్రజెంటేషన్‌లో పాల్గొని ఆ సంస్థ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. సుందరీకరించేందుకు చేపట్టవలసిన అభివృద్ధి పనులపై చర్చించారు. పట్టణ సుందరీకరణ, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, పచ్చదనం పెంపు, ఎకో టూరిజం అభివృద్ధి తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమగ్ర ప్రణాళికలను వివరించారు. ఈ ప్రతిపాదనలపై ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, అధికారులు తమ అభిప్రాయాలను సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కదిరికి చారిత్రక ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఎంతో గొప్పదని కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకాన్ని సమర్థవంతంగా వివరించి శ్రీమత్‌ఖాద్రి లక్ష్మినరసింహస్వామి ఆలయాన్ని దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందే ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఆలయ అభివృద్ధితోపాటు దర్శనానికి వచ్చే భక్తులకు ఆధునిక సౌకరార్యలు, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన రవాణా, పార్కింగ్, విశ్రాంతి కేంద్రాలు, సుందరమైన ఉద్యాన వనాలు, ఎకో టూరిజం ప్రాజెక్టులు ఏర్పాటు చేయడం ద్వారా కదిరి అభివృద్ధికి కొత్త ఊపు తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కెఎంజి సంస్థతో అధికారికంగా ఒప్పందం కుదుర్చుకుని శాస్త్రీయ ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆలయ ఆగమ శాస్త్ర సాంప్రదాయాలకు ఎలాంటి భంగం కలగకుండా అన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. స్థానిక ప్రజల అభిప్రాయాలు, అవసరాలను పరిగణలోకి తీసుకుని ప్రణాళికలను తుది రూపు దిద్దాలని స్పష్టం చేశారు. స్పిరిచ్వల్ టూరిజంతోపాటు ఎకో టూరిజంను ప్రోత్సహించడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు వ్యాపార రంగం కూడా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భక్తులు, పర్యటకులకు మరింత మెరుగైన అనుభూతి కల్పించే విధంగా కదిరి పట్టణాన్ని తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ విజయ్‌కుమార్, ఆలయ ఈఓ శ్రీనివాసులు రెడ్డి, డిఎస్‌పి శివనారాయణస్వామి, సిప నారాయణరెడ్డి, కెఎంజి సంస్థ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# అరకొరగా విద్యార్థి కిట్స్...!

### - 195823 మందికి గాను 58970 మందికి మాత్రమే యూనిఫామ్స్
### - బ్యాగ్స్ కూడా 107787 మందికి మాత్రమే 176967 మందికి మాత్రమే షూ
### - పాత యూనిఫామ్స్ తోనే పాఠశాలలకు




పాత యూనిఫామ్స్, కలర్ డ్రెస్ లతో పాఠశాలకు వచ్చిన అనంతపురం విద్యారణ్య నగర్ జడ్పిహెచ్‌ఎస్ విద్యార్థులు

**అనంతపురం న్యూటౌన్, జూన్ 26 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వము అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటుంది. అందులో విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరం ప్రారంభం రోజే సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర విద్యార్థి కిట్స్‌ను విద్యార్థులకు అందజేయాలని ప్రభుత్వము విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేసింది. కానీ నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు వారాలు కావస్తున్నప్పటికీ నేటికీ అరకొరగానే విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేయడం గమనార్హం. దీంతో

మిగతా 3లో...

02ATP26.qxd:02ATP26.qxd 27/06/26 11:33 PM Page 1



## శ్రీకృష్ణదేవరాయుల విగ్రహావిష్కరణకు ఆహ్వానం



కాపునాడు నాయకులను ఆహ్వానిస్తున్న బలిజ సంఘం నాయకులు

హిందూపురం టౌన్ జూన్ 26 ప్రభాతవార్త

కదిరి పట్టణంలో రేపు జరిగే శ్రీకృష్ణదేవరాయుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రావాలని శుక్రవారం కదిరికి చెందిన బలిజ సంఘం నాయకులు హిందూపురం కాపునాడు నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్, హిందూపురం పట్టణ అధ్యక్షుడు బలిజ విశ్వనాథ్ తదితరులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుజాతి వైభవానికి ప్రతిక అయిన శ్రీకృష్ణదేవరాయుల స్ఫూర్తిని చిరస్థాయిగా నిలిపే విధంగా శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కదిరి బలిజ సంఘం నాయకులు గవ్వల శ్రీనివాసులు, చింతకుంట రమేష్ బాబు, శ్రీనివాసులు, నరేంద్ర, శంకర్, హిందూపురం బలిజ సంఘం నాయకులు పీవీ వెంకటరాముడు, విజయ్ గోపాల్, నిమ్మకాయల రాము, నాగరాజు, రజిని, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ ఈరన్న

అమరాపురం జూన్ 26 ప్రభాతవార్త



సర్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ

మండల పరిధిలోని హేమావతి గ్రామపంచాయతీ పరిధిలోని కేంకేర గ్రామంలో శుక్రవారం సర్ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల సర్వేలో అమరాపురం ఎంపీపీ కేంకేర ఈరన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెంకెర గ్రామంలోని 33, 34 బూత్ల పరిధిలో బిఎల్వో మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ల సర్వే కార్యక్రమంలో ఆయన పాల్గొని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మండల వ్యాప్తంగా ప్రతి ఓ గ్రామంలోనూ సర్ కార్యక్రమంలో వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొని ఓటర్ల జాబితాను చూసుకోవడంతో పాటు ఓటర్లు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. అమరాపురం పట్టణంలో మండల వైకాపా యువజన అధ్యక్షుడు మల్లికార్జున సర్ కార్యక్రమంలో పాల్గొని ఓటర్ల వివరాలను పరిశీలించారు

## గాయపడిన యువకుడు మృతి

హిందూపురం జూన్ 26 ప్రభాతవార్త



మృతిచెందిన రిజ్వాన్ భాషా

పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద గురువారం గుర్తు తెలియని ఆటో ఢీకొని జరిగిన రోడ్డు ప్రమాదంలో హిందూపురం పట్టణం రహమత్పురంకు చెందిన మహబూబ్ బాషా కుమారుడు రిజ్వాన్ భాషా 28 గాయపడగా చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై హిందూపురం ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఘనంగా పెద్ద సరగత్తి వేడుకలు



పీర్లకు చెక్కెర ఇస్తున్న భక్తులు

డి.హిరెహాళ్ జూన్ 26 ప్రభాతవార్త

మొహారం వేడుకల సందర్భంగ పెద్ద సరిగత్తి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం డి.హిరెహాళ్ మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో మొహారం వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల పరిధిలోని హెచ్. సిద్దాపురం, మలాపనగుడి, ఓబులాపురం తదితర గ్రామాల్లో మొహారం పెద్ద సరగత్తి వేడుకల సందర్భంగ స్వామివారికి భక్తులు సాంప్రదాయబద్ధంగ, ఆనవాయితీగ చక్కెర చదివించి ముక్కులు తీర్చుకున్నారు. మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో గురువారం, శుక్రవారం మొహారం వేడుకలను జరుపుకోవాలని మరికొన్ని గ్రామాల్లో శనివారం, ఆదివారం రోజున పెద్ద సరగత్తి వేడుకలను జరుపుకొని పీర్లను నిమజ్జనం కు తరలిస్తున్నట్లు ఆయా గ్రామాల మొహారం కమిటీ సభ్యులు తెలిపారు. మొహారం సందర్భంగ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ ఎస్.ఐ. గురుప్రసాద్ రెడ్డి తమ సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు.

## పర్వత అధిరోహితుడు ఈశ్వర్‌కి కొత్త పాళ్యం తిరుమల తిరుపతి దేవస్థానంలో సన్మానం



పర్వత అధిరోహితుడు ఈశ్వర్ ను సన్మానిస్తున్న దృశ్యం

మడకశిర జూన్ 26 ప్రభాతవార్త

రోళ్ల మండలం కొత్త పాళ్యంలో భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు శ్రీ విష్ణువర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం కమిటీ చైర్మన్ గోవిందరాజులు, బిజెపి రాష్ట్ర నాయకులు, సింగల్ విండో డైరెక్టర్ చంద్రశేఖర్ లు పర్వత అధిరోహితుడు ఈశ్వర్ ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ గోవిందరాజులు, బిజెపి నాయకులుచంద్రశేఖర్ లు మాట్లాడుతూ ఈశ్వర్ కి అన్ని విధాలుగా మా నుంచి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ గోవిందరాజులు 25 వేల రూపాయలను చెక్ రూపంలో ఇవ్వగా, బిజెపి రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్ రూపాయలు 10,000 లను నగదు రూపంలో ఈశ్వర్‌కు అందించారు. అందుకు ఈశ్వర్ వారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో మన రాష్ట్రానికి, మారుమూల ప్రాంతామైన మడకశిర గర్వించేలా పేరు ప్రతిష్టలు తెస్తానని అధిరోహితుడు ఈశ్వర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు అగళి మండల అధ్యక్షురాలు శ్రీమతి విక్టోరియా రాణి, కిసాన్ మోర్చా మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ రంగయ్య గౌడ్, జిల్లా టీచర్ సెల్ మాజీ కన్వీనర్ లక్ష్మీనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు సి.ఎల్ లింకప్ప, పట్టణ మాజీ ఉపాధ్యక్షులు భానుదాస్, జిల్లా మాజీ కార్యవర్గ సభ్యులు హనుమంతు, గోవిందప్ప, యువ నాయకులు చంద్రశేఖర్, తెదేపా నాయకులు జిల్లా అధికార ప్రతినిధి కే ఏ నాగేంద్ర, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు కే ఏ మారుతి, వైజాగ్ రమేష్, రవి, మంజు,సురేష్ జల్లు, శ్రీకాంత్, హేమంత్, నరేష్, కృష్ణ, రామచంద్ర, పూజారి రామాంజనేయులు, పర్వత అధిరోహితుడు ఈశ్వర్ ను ఘనంగా సన్మానించారు.

## నేడు,రేపు సర్ పై నియోజకవర్గం లో ప్రత్యేక ప్రచార కార్యక్రమం

### నియోజకవర్గం ఓటర్ నమోదు అధికారి ఆర్డీఓ ఆనంద్ కుమార్



ఆర్డీఓ ఆనంద్ కుమార్

పెనుకొండ జూన్ 26 ప్రభాతవార్త

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితాల నవీకరణ ప్రక్రియను వేగవంతం చేయుటకు జూన్ 27వ, 28వ,తేదీలలో ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెనుకొండ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి ఆనంద్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రకటన ద్వారా ఆయన మాట్లాడుతూ పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అన్ని బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓ లు) ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారములను పంపిణీ చేయడం,సేకరించడం వాటి డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు.ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ కుటుంబ సభ్యుల వివరాలను సరైన విధంగా నమోదు చేసి,బిఎల్ఓ లకు సహకరించాలని కోరారు. ఇంకా ఫారములు అందుకోని లేదా సమర్పించని ఓటర్లు ప్రత్యేక ప్రచార దినాలలో బిఎల్ఓ లను సంప్రదించి తమ ఫారములను అందజేయవచ్చని సూచించారు.అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీ ప్రతినిధులు, ప్రజలు ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించాలని కోరారు. పెనుకొండ నియోజకవర్గంలో ఓటరు నమోదు ప్రక్రియను100 శాతం పూర్తి చేయడమే ఈ ప్రత్యేక ప్రచార కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.

## ఘనంగా లక్ష్మినరసింహస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ రేగటి నాగరాజు జన్మదిన వేడుకలు



పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ రేగటి నాగరాజు జన్మదిన వేడుకల దృశ్యం

ఉరవకొండ, జూన్ 26 ప్రభాతవార్త

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మినరసింహ స్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ రాయంపల్లి రేగటి నాగరాజు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఎస్.కె రిక్రియేషన్ క్లబ్‌లో రేగటి నాగరాజు అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీలు, రాజకీయాలకు అతీతంగా నాయకులు, అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి శాలువాకప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. రేగటి నాగరాజు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉంటూ ఆయన సార థ్యంలో లక్ష్మినరసింహస్వామి ఆలయం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## ఆత్మహత్య కాదు.. ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్లాలి..!

**-జీవితం అమూల్యం, ప్రతి సమస్యకూ పరిష్కారం ఉంటుంది**

**-ఐసీడీఎస్ ఉరవకొండ ప్రాజెక్టు సీడీపీవో డా॥బి.ఎన్.శ్రీదేవి**

ఉరవకొండ, జూన్ 26 ప్రభాతవార్త



ఐసీడీఎస్ సీడీపీవో డా॥బి.ఎన్.శ్రీదేవి

ఆత్మహత్యలు ఏ సమస్యకూ పరిష్కారం కాదని ఆత్మ విశ్వాసంతో ముందుకు అడుగు వేయాలని ఐసీడీఎస్ ఉరవకొండ ప్రాజెక్టు సీడీపీవో డా॥బి.ఎన్.శ్రీదేవి సూచించారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని సందర్భాల్లో మనకు ఎదురయ్యే సమస్యలు చాలా పెద్దవిగా కనిపించవచ్చని అంతమాత్రాన ఆత్మహత్య చేసుకోవడం సమస్యలకు పరిష్కారం కాదన్నారు. పరీక్షల్లో ఫెయిల్ కావడం, ప్రేమలో నిరాశ, కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, గృహ హింస, ఉద్యోగ సమస్యలు మనసును తీవ్రంగా కలిచివేయవచ్చని అయితే ఏ సమస్య కూడా ప్రాణం కంటే గొప్పది కాదన్నారు. ఆత్మహత్య ఒక క్షణిక నిర్ణయమని కానీ దాని ప్రభావం కుటుంబ సభ్యులు, పిల్లలు, తల్లిదండ్రులు, సమాజంపై జీవితాంతం ఉంటుందన్నారు. ఆత్మహత్యల వల్ల తల్లిదండ్రులు, జీవిత భాగస్వామి, పిల్లలు జీవితాంతం మానసిక వేదనను అనుభవిస్తారన్నారు. చిన్న పిల్లలు అనాథలుగా మారడమో లేక నిర్లక్ష్యానికి గురయ్యే ప్రమాదం ఉంటుందన్నారు. కుటుంబ సభ్యులు మనం ఇంకేమైనా చేయగలిగేవాళ్లమా అనే బాధతో జీవిస్తారని, సమాజంలో నిరాశ, భయం, అ సురక్షిత భావం పెరుగుతుందన్నారు. ఆత్మహత్యలవల్ల సమస్య ముగియదని బాధ మాత్రం మరింత మందికి వ్యాపిస్తుందన్నారు.

టీనేజీ పిల్లలైతే చదువులో ఒత్తిడి, పరీక్షల్లో ఫెయిల్ కావడం, ప్రేమ వ్యవహారం, సోషల్ మీడియా ట్రోలింగ్, కుటుంబ గొడవలు, స్నేహితుల వేధింపులు లాంటి సమస్యలు ఏవైనా గాని ఆత్మస్థైర్యాన్ని మాత్రం విడనాడరాదన్నారు. మార్కులు జీవితాన్ని నిర్ణయించవని, ప్రేమలో విఫలం కావడం జీవితంలో విఫలం కావడం కాదన్నారు. సమస్యలు ఎదురైనపుడు తల్లిదండ్రులతో మాట్లాడటం, టీచర్ లేదా కౌన్సెలర్‌ను సంప్రదించి భావాలను వ్యక్తపర్చాలన్నారు. క్రీడలు, సంగీతం, పుస్తకాల వంటి హాబీలపై దృష్టి పెట్టాలన్నారు. సహాయం కోసం ఛైల్డ్‌లైన్ 1098, అత్యవసర సేవలు 112, పాఠశాల కౌన్సెలర్లు, జిలాల బాలల పరిరక్షణ విభాగం (డీసీపీయు)ను సంప్రదించాలనా న్నరు.

## భార్యపై భర్త దాడి...!

**మంగళసూత్రం లాక్కెళ్ళిన భర్త పై భార్య పోలీసులకు ఫిర్యాదు...!**

ధర్మవరం, జూన్ 26, ప్రభాతవార్త

భార్యపై భర్త సాకే రామాంజినేయులు దాడి చేసి, మెడలో ఉన్న బంగారు ఆభరణాలను లాక్కెళ్లిన సంఘటన శుక్రవారం ధర్మవరంలో జరిగింది. వన్ సీఐ రెడ్డప్ప తెలిపినవివరాల మేరకు... చెన్నేకొత్తపల్లి గ్రామానికి చెందిన శివమ్మ, ధర్మవరం మండలం వెంకటతిమ్మాపురం గ్రామానికి చెందిన సాకే రామాంజినేయులు 10సంవత్సరాలక్రితం వివాహమైంది.అయితే ఆమెపై అనుమానం పెంచుకున్న రామాంజినేయులు వేధింపులకు గురిచేశాడు.దీం తో ఆమె కొన్నాళ్లు పుట్టింటిలో ఉంటోంది. ఈ క్రమంలో పిల్లల చదువులకోసం ధర్మవరంలో ఉంటూ పిల్లలను ప్రైవేటుస్కూల్లో చదివించేది. ఈ ఏడాది ఆర్థిక చదివించలేక సీకేపల్లి ప్రభుత్వ సమస్యలతో ప్రైవేటు స్కూల్లో పాఠశాలలోచదివించాలని నిర్ణయించింది. దీంతో ఆమె పిల్లల సర్టిఫికెట్ల కోసం సాదన ప్రైవేటు స్కూల్ వద్దకు వెళ్లింది.ఆ సమయంలో భర్త సాకే రామాంజినేయ లు అక్కడికి వచ్చి ఆమెపై దాడి చేసి ఆమె మెడలో ఉన్న మంగళసూత్రం, బంగారు లాక్కెళ్లాడని బాధితురాలు పిర్యాదులో పేర్కొందని సీఐ తెలిపారు.

## గుంతకల్ డివిజన్ సీనియర్ డిఓఎంగా దినేష్ కుమార్

గుంతకల్ రైల్వే, జూన్ 26,ప్రభాతవార్త

గుంతకల్ డివిజన్‌లో 2014 బ్యాచ్ చెందిన ఎం.దినేష్ కుమార్ సీనియర్ డి ఓ యం గా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రైల్వేలో వివిధ విభాగాల్లో పనిచేసి విశేష అనుభవాన్ని సంపాదించారు. గతంలో విజయవాడ సీనియర్ డిఓఎం జనరల్ గా పనిచేసే గుంతకల్లుకు బదిలీపై వచ్చారు.

## డ్రగ్స్ వద్దు ... భవిష్యత్తు ముద్దు



ఆటో డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమణి, వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప లు

ధర్మవరంటౌన్ , జూన్ 26 ప్రభాతవార్త

ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మవరం పట్టణంలోని కాలేజ్ సర్కిల్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమణి, వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమణి, మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తి జీవితానికే కాకుండా సమాజానికి కూడా తీవ్ర ముప్పుగా మారుతుందని అన్నారు. డ్రగ్స్‌ను కలిగి ఉండటం, రవాణా చేయడం, స్వీకరించడం లేదా విక్రయించడం వంటి చర్యలు చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన కేసులు నమోదు చేసి జైలు శిక్షలు విధిస్తారని హెచ్చరించారు.వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప మాట్లాడుతూ యువత ముఖ్యంగా విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వద్దు భవిష్యత్తు ముద్దు అనే నినాదంతో యువతలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే విలువైన భవిష్యత్తు నాశనం అవుతుందని, కుటుంబాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సివిల్ స్టేషన్ ఎస్ఐలు వీరేష్, ఇషాక్ బాషా, ఎక్సైజ్ మరియు పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు

## జూలై 5న ఉచిత కంటి వైద్యశిబిరం



కరపత్రాలను విడుదల చేస్తున్న యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

ధర్మవరంటౌన్ , జూన్ 26 ప్రభాతవార్త

ప్రజల కంటి ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా యువర్స్ ఫౌండేషన్, బెంగళూరుకు చెందిన నేత్రజ్యోతి కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో జూలై 5వ తేదీన ధర్మవరంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక స్వాతి క్లినిక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉచిత కంటి వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కంటి చూపు మందగించడం, మసకగా కనిపించడం, ఇతర నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, వెంకట నాగార్జున, చాంద్ బాషా, బండ్లపల్లి రంగనాథ్, సుంకు సురేష్, రాధాకృష్ణ, కోటేశ్వరరావు, ఓవి ప్రసాద్, కేతా లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంఘం మహాసభలను జయప్రదం చేయండి



మహాసభ పోస్టర్లను విడుదల చేస్తున్న రైతుసంఘంనాయకులు

ధర్మవరం, జూన్ 26, ప్రభాతవార్త

ఏలూరులో జూలై 3,4,5 తేదీల్లో జరిగే ఏపీ రైతుసంఘం రాష్ట్ర 23వ మహాసభలను జయప్రదంచేయాలని ఏపీరైతుసంఘం జిల్లా అద్యక్షులు జంగాలపల్లిపెద్దన్న పిలుపు నిచ్చారు. స్థానిక రైతుసంఘం కార్యాలయం వద్ద శుక్రవారం మహాసభలకు సంబందించిన పోస్టర్లను ఆయనతో పాటు రైతుసంఘం నాయకులు విడుదల చేశారు. అనంతరం జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ మూడు సంవత్సరాలకు మహాసభలను ఒకసారి జరుపుకుటామన్నారు. ఈ మహాసభలో రైతుల హక్కులకోసం పోరాటాలకు పిలుపు నివ్వడం జరుగుతుందన్నారు. రైతుల సమస్యలను ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికివదిలేశాయన్నారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కమిటిసభ్యులు మారుతి, ఎస్బాషా, జేవీరమణ, పురుషోత్తం, అయూబ్ఖాన్, పాల్గొన్నారు.

## జలదీకి వెళ్లిన పీర్లు



జలదీకి వెళ్తున్న పీర్లు

రామగిరి, జూన్ 26 ప్రభాతవార్త

మండల కేంద్రమైన రామగిరిలో మొహారం పండుగను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గురువారం రాత్రి పానకాలు మోశారు. రాత్రంతా అలావ్ తొక్కుతూ సందడిగాగడిపారున తెల్లవారు జామునే పేర్లను గ్రామంలో ఊరేగించి అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఉదయం చక్కెర చదివిం పులతో పాటు పీర్లను ఊరేగింపుగా జలదీకి తరలించారు. ఈ సందర్భంగా పీర్ల స్వాములకు భక్తులు భక్తిశ్రద్ధలతో చక్కెర, బెల్లం చదివింపులు చేసి ఆనందోత్సవాల మధ్య జలదీకి తరలించారు. రామగిరి ఎస్ఐ ప్రదీప్ రాజు ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షణ చేపట్టారు.

## 30న అమరాపురంలో జాబ్ మేళా

అమరాపురం జూన్ 26 ప్రభాతవార్త



రామారావు

మండల కేంద్రమైన అమరాపురంలోని ఎంపీడీవో కార్యాలయం నందు ఈనెల 30న మంగళవారం ఉదయం 9 గంటల నుండి శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు మరియు మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యా భివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో జాబ్ మీద కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్లు ఎంపీడీవో రామారావు తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో 10 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొనుచున్నాయని , వాటి ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతి యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో హాజరు అయ్యే నిరుద్యోగ యువతీ,యువకులు విద్యార్హతలు పదవ తరగతి,ఇంటర్, ఐ.టి.ఐ, డిప్లొమా, డిగ్రీ , బి.టెక్, పి.జి, చదివిన వారు 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని,ఈమెగా జాబ్ మేళా లో సెలెక్ట్ అయిన అభ్యర్థులకి నెలకి రూ 15 వేల నుండి 25 వేల వరకు జీతం ఉంటుందని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 99666 82246 ఫోన్ నంబర్ కు సంప్రదించాలనితెలియజేశారు.

## కురువల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తాం

### ఏకగ్రీవంగా కురువ సంఘం నూతన కార్యవర్గం ఎంపిక



కురుబ సంఘం నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

పుట్టపర్తి, జూన్ 26, ప్రభాతవార్త

కురువ సంఘం సర్వతో ముఖాభివృద్ధి కొరకై అహర్నిశలు కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన కురువ సంఘం కార్యవర్గ సభ్యులు,నాయకులు పేర్కొ న్నారు. శుక్రవారం స్థానిక సాయి ఆరామంలో పుట్టపర్తి నియోజకవర్గం కురుబ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో కురువ కులస్తులను సంఘటితం చేసి సమస్యలు పరిష్కరించడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. జిల్లాలో మంత్రితో పాటు ఎంపీల దృష్టికి కురువలు ఎదుర్కొంటున్న సమస్యలను తీసుకువెళ్లి పరిష్కరించుకుందామన్నారు. కురువలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి శివానంద ఈ సమావేశానికి అధ్యక్షత వహించగా సంఘం అధ్యక్షులుగా రమేష్, ఉపాధ్యక్షులుగా మల్లికార్జున , ఒడిసి తరుణ్ కుమార్ , గౌరవ అధ్యక్షులుగా రామచంద్ర, లను ఎన్నుకున్నారు. పుట్టపర్తి మండల అధ్యక్షులుగా పైపల్లి సురేష్ లను ఎన్నుకున్నారు. కొత్తచెరువు మండల కమిటీ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ ఉపాధ్యక్షులుగా పోతులకుంట జయప్ప, కిష్టప్ప, తదితరులను ఎన్నుకున్నారు. అమడుగురు మండల కమిటీ అధ్యక్షులుగా రమేష్ ఉపాధ్యక్షులుగా ఉత్తప్ప ఓడిసి మండల కమిటీ అధ్యక్షులుగా సుధాకర్ ఉపాధ్యక్షులుగా గోసే భాస్కర్, ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షులు మల్లికార్జున, కార్పొరేషన్ డైరెక్టర్లు శ్రీనివాసులు, కృష్ణయ్య, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, ఉపాధ్యక్షులు చెన్నప్ప జిల్లాకార్యవర్గ సభ్యులు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ మనోహర్‌కు ఆర్థిక సాయం

కనగానపల్లి జూన్ 26 ప్రభాతవార్త



విద్యార్థి తల్లి తండ్రులను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

మండల కేంద్రానికి చెందిన దేవరకొండ మనోహర్ ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో 576 అత్యధిక మార్కులతో పాసయ్యాడు. మండల కేంద్రంలోనీ విద్యార్థి నివాసంకి వెళ్లి శనివారం పద్మశాలి సంఘం నాయకులు విద్యార్థి తల్లిదండ్రులు దేవరకొండ ఇందిరమ్మ, నరసింహులు ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వారికి 30 వేల రూపాయలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి ఉన్నత చదువులకు ఏ సహాయం కావాలన్నా సంఘం దృష్టికి తీసుకురావాలని సంఘం చేతనైన సహాయం చేసేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు పొదరాళ్ళ రవీంద్రనాథ్, దేవరకొండ సత్యం, వరద ప్రహల్లాద,బసాపతి రాజేష్ కుమార్, పొదరాళ్ళ వేణుగోపాల్, శీలా శ్రీనివాసులు, పొదరాళ్ళ గోపాలకృష్ణ, గ్రామ పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనకు ఎక్సైజ్ శాఖ చర్యలు

### మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ తనిఖీలు

కణేకల్, జూన్ 26 ప్రభాతవార్త



మద్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్క రించుకుని అనంతపురం జిల్లా డిప్యూటీ కమిషనర్ (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్) ఆదేశాల మేరకు కణేకల్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృత అవగాహన కార్యక్రమాలు, తనిఖీలు నిర్వహించారు. బొమ్మనహల్ మండలం లోని జిందాల్ ఫ్యాక్టరీలో కార్మికులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఆర్. ఉమాబాయి మాట్లాడుతూ మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబ, ఆర్థిక, సామాజిక జీవితంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం కణేకల్ మండలం ఎర్రగుంట గ్రామంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మద్యం నాణ్యతను పరిశీలించేందుకు శాంపిల్లను సేకరించారు. అలాగే గ్రామంలోని కల్లు దుకాణాలను కూడా తనిఖీ చేసి, కల్లు శాంపిల్లను సేకరించి పరీక్షల కోసం పంపించారు. అక్రమ మద్యం విక్రయాలు, నాణ్యతలేని మద్యం విక్రయాలపై శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎస్. షేక్షావలి, అధికారి ఎ. రమేష్ తో పాటు కణేకల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రత్నగిరిలో ఘనంగా మొహారం వేడుకలు



అగ్నిగుండం చుట్టూ పేర్లను ప్రదక్షిణాలు చేస్తున్న దృశ్యం

రొళ్ల జూన్26 (ప్రభాత వార్త):

మండలంలోని రత్నగిరి గ్రామంలో మొహారం వేడు కలను ఘనంగా జరుపుకున్నారు.మతాలకు అతీతంగా ముస్లిం సోదరులతో పాటు హిందువులు 9రోజుల పాటు జరిగిన పీర్ల పండుగను రత్నగిరి గ్రామంలో నిర్వహించారు.శుక్రవారం జలధి ఉత్సవాల కార్యక్రమం జరిగింది. ఉదయం నుంచే పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వ హించడం జరిగింది.అనంతరం మొక్కు బడి ఉన్న మహిళలు నిప్పులను తలపై పోయించుకునీ అగ్నిగుండంలో నడిచారు. గ్రామాల్లో వివిధ వేషధారణలతో గ్రామస్తులు నృత్యాలు చేస్తూ ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించారు. అలాగే కాగడాల ప్రదర్శనతో గ్రామంలో పాల బావిలో బాబయ్యలకు జలధి ఉత్సవాలను నిర్వహిస్తూ ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా జరుపు కున్నారు. ఈకార్యక్రమంలో భాగంగా భ క్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో పాటు తీర్థ ప్ర సాదాలను అందించారు.

03ATP26.qxd:03ATP26.qxd 27/06/26 12:01 AM Page 1



# ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఘటనపై ఏపీ ఎస్‌సీపీసీఆర్ పర్యవేక్షణ కొనసాగుతోంది

## - ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డా.డి.నివాసమూర్తి

అనంతపురం, జూన్ 26 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో పిండం (ఫీటస్) లభ్యమైన ఘటనకు సంబంధించిన వార్తలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపి పిఎస్‌సిపిసిఆర్) తీవ్రంగా పరిగణించి, వెంటనే సంబంధిత అధికారుల నుంచి నివేదికలు కోరిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డా.డి.నివాసమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తెలియజేస్తూ ఈ ఘటనపై జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డిసిపియు) జిల్లా బాలల పరిరక్షణ అధికారి మంజునాథ, ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ ఆసుపత్రిని సందర్శించి సమగ్ర విచారణ నిర్వహించినటు తెలిపారు.

వారి ప్రాథమిక నివేదిక ప్రకారం, సంఘటనా స్థలంలో లభ్యమైనది సుమారు ఐదు నెలల గర్భస్థ పిండమని, ఆసుపత్రి రికార్డుల పరిశీలనలో ఆసుపత్రిలో జన్మించిన లేదా చికిత్సలో ఉన్న ఏ శిశువూ గలంతు కాలేదని గుర్తించారు. అయితే, ఈ పిండం ఆసుపత్రి ప్రాంగ ణానికి ఎలా చేరింది, దానికి దారితీసిన పరిస్థితులు ఏమిటి, సంబంధిత వ్యక్తులు ఎవరు అనే అంశాలపై పోలీసు శాఖ, వైద్య ఆరోగ్య శాఖ విచారణ కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సంబంధిత అ ధికారులను క్రింది అంశాలపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఘటనపై సమగ్ర విచారణను వేగ వంతంగా పూర్తి చేయాలి, ఆసు పత్రి ప్రాంగణంలోని సీసీటీవీ బ్లైం డ్ స్పాటను తొలగించి భద్రతా వ్యవస్థను బలోపేతం చేయాలి, ప్రసూతి, గైనకాలజీ విభాగాలలో పర్యవేక్షణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలి, గర్భ స్రావాలు, మృత శిశువులు, గర్భస్థ పిండాల నిర్వహణకు సంబంధించిన అన్ని నిబంధ నలను కచ్చితంగా అమలు చేయా లి, ఇటువంటి ఘటనలు పునరా వృతం కాకుండా జిల్లా స్థాయిలో అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలి, ఈ కేసులో వాస్త వాలు పూర్తిగా వెలుగులోకి వచ్చే వరకు ఎపిఎస్‌సిపిసిఆర్ నిరంతరం పర్య వేక్షణ కొనసాగిస్తుంది. అవసరమైతే సంబంధిత అధికారులకు మరిన్ని ఆర్డర్స్ జారీ చేయడంతో పాటు, బాధ్యతాయుతమైన పరిపాలనా చర్యలు చేపట్టేలా కమిషన్ చర్యలు తీసుకుంటుంది.


డా.డి. నివాస మూర్తి

# వాస్తవాలు మాట్లాడాలి ఆరోపణలు కాదు

## - డిపమా ఇంజనీరపై నిరాధార వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

అనంతపురం, జూన్ 26 ప్రభాతవార్త బ్యూరో

పదోన్నతులు పొందిన గ్రాడ్యుయేట్ ఇంజనీరందరికీ పంచాయతీ రాజ్ డిపమా ఇంజనీర్స్ అసోసియేషన్, అనంతపురం జిల్లా తరఫున హృద యపూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు. శుక్రవారం వారు పత్రికా సమావేశంలో మాటాడుతూ ఈ పదోన్నతుల సందర్భంగా కొందరు విడుదల చేసిన ప్రకటనలో డిపమా ఇంజనీరను పరోక్షంగా లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలు విచారకరం అని అన్నారు.

ప్రస్తుతం కల్పించిన పదోన్నతులు ప్రభుత్వం అమలు చేస్తున్న నిబంధనలు, సర్వీస్ రూల్స్ కోర్టు తీర్పులకు అనుగుణంగా జరిగాయి. 1994, 1997 బ్యాచ్‌ల గ్రాడ్యుయేట్ ఇంజనీర మధ్య కొనసాగు తున్న వివాదం పూర్తిగా కోర్టు పరిధిలోని అంశం. ఆ వివాదానికి డిప్లమా ఇంజనీరకు ఎలాంటి సంబంధం లేదు. తమకు సంబంధించిన కోర్టు వ్యవహా రాలను పక్కనపెట్టి, డిపమా ఇంజనీరను విమర్శించడం లేదా వారి పదోన్న తులతో ముడిపెట్టడం వాస్తవాలను వక్రీకరించడమే అవుతుంది. అలాంటి వ్యాఖ్యలను మా సంఘం పూర్తిగా ఖండిస్తోందని అన్నారు. డిపమా ఇంజ నీరు తక్కువ అర్హత కలిగిన వారనే భావన కలిగించే వ్యా ఖ్యలు చేయడం బాధ్యతాయు తమైన సంఘాలకు తగినది కా దు. డిపమా ఇంజనీరలో కూడా బి.టెక్., ఎం.టెక్., పీహెచ్.డి. వంటి ఉన్నత విద్యార్హతలు కలిగిన అధికారులు ఉన్నారు. ఉద్యోగుల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్య లు శాఖలో ఐక్యతను దెబ్బతీ స్తాయి. ఇకపై ఏ ఉద్యోగ వర్గం గౌరవాన్ని దెబ్బతీసే విధంగా నిరాధార ఆరోపణలు లేదా వ్యాఖ్యలు చేస్తే, పంచాయతీ రాజ్ డిపమా ఇంజనీర్స్ అసోసియేషన్ వాస్తవాలతో తగిన విధంగా స్పందిస్తుందని స్పష్టం చేశారు.


మాటాడుతున్న యూనియన్ నాయకులు

# ఎస్ఐఆర్ పట నిరలక్ష్యం వద్దు అందరూ యాక్టీవ్‌గా పని చేయాలి

## - పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన

అనంతపురం, జూన్ 26 ప్రభాతవార్త బ్యూరో

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పట ఎవరూ నిరలక్ష్యం వహించవద్దని క్షేత్రస్థాయిలో చురుకుగా పని చేయాలని పార్టీ శ్రేణులకు రాప్తా దు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. అనంతపురం క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆమె ఎస్ఐఆర్‌పై సమావేశం నిర్వహించారు.

ఈనెల 15వ తేది నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఎంత వరకు పని చేస్తున్నారని ఆరా తీశారు. కొన్ని చోట ఈ విషయంపై అవగాహన లేకపోవడం, బీఎల్‌ఏలు సరిగా పని చేయకపోవడం వంటి విషయాలను ఎమ్మెల్యే సునీత ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రతీ 2025 ఏళ్ళకోసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ జరుగుతుందని 2002 ఓటర జాబితాను పరిగణలోకి తీసుకుని చేస్తున్నటు చెప్పామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జులై 14వ తేదీలోగా రెండుసారు ఓట మ్యాపింగ్ చేస్తారన్నారు. జులై 15నుంచి ఆగస్టు నెలాఖరు వరకు ఇంటింటి ప్రచారం చేపట్టాల్సి ఉంటుందన్నారు. బీఎల్‌ఏలు ప్రతి ఇంటికీ రెండు సారు వెళి అవగాహన కల్పించాలన్నారు. అర్హులైన ఏ ఒక్క ఓటు కూడా పోకుండా చూడాలన్నారు. వైసీపీ నాయకులు చేస్తున్న పనుల మీద అప్రమత్తంగా ఉండాలన్నారు. కొందరు చదువుకోని వారిని మభ్యపెట్టే ప్రమాదం ఉంటు oదని బీఎల్‌ఏలు ఈవి షయాన్ని ఎప్పటికప్పుడు పరిశీ లించి తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.


మాటాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

# ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి శాశ్వత మినహాయింపు కల్పించాలి

## - ఆర్‌టిఇ చట్టానికి పారమెంట్‌లో సవరణలు చేయాలని ఎంపీకి ఫోర్టో వినతి

అనంతపురం న్యూటౌన్, జూన్ 26 ప్రభాతవార్త

ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి శాశ్వత మినహాయింపు కల్పించేలా విద్యా హక్కు చట్టం (ఆర్‌టిఇ యాక్ట్-2009)లో సవరణలు చేయాలని కోరుతూ ఫోర్టో ఆధ్వర్యంలో పారమెంట్ సభ్యులు అంబికా లక్ష్మినారాయణకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫోర్టో చైర్మన్ కరణం హరికృష్ణ, గాండపర్తి శివానందరెడ్డి, ఎ.ఎస్.పెద్దన్న కూరపాటి నరసిం హారెడ్డి, ఎపి ఎస్ఇఎ సలపలి విజయ భాస్కర్‌లు మాటాడుతూ ప్రస్తుతం సేవలో ఉన్న ఉపాధ్యా యులు అప్పటి నియామక నిబంధనల ప్రకారమే అర్హతలు పొంది ప్రభుత్వ సేవలో చేరారని తెలిపారు. అనేక సంవత్సరాలుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను మళీ టెట్ పరీక్ష రాయాలని నిర్బంధించడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ సమస్యను పారమెంట్‌లో ప్రస్తావించి, కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళి, దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫోర్టో నాయ కులు ఆదిశేషయ్య, వేణుగోపాల్, జావిద్ అహ్మద్, ఆంజనే యులు, నారా యణస్వామి జోషికుమార్, గోపాలప్ప, జాన్, వెంకటేశులు, రమేష్ బాబు, ఎస్ వేణుగోపాల్, రమణ ప్రసాద్, వెంకటరాముడు వెంకట ప్రసాద్ రెడ్డి, జితేంద్ర, కిష్టప్ప, మంజు నాథ్, బాలసుబ్ర మణ్యం, రాఘవేంద్ర, వెంకట రమణ, నాగరాజు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, పలువురు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎంపికి వినతిపత్రం అందజేస్తున్న ఫోర్టో నేతలు

# అంతర్జాతీయ వేదికపై అనంతపురం యువకుడి ప్రతిభ

## - అజర్‌బైజాన్‌లో జరిగే 9వ సి.ఐ.సి.ఏ యూత్ కౌన్సిల్ సమావేశం 2026లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన బిసాతి భరత్

అనంతపురం న్యూటౌన్, జూన్ 26 ప్రభాతవార్త

అనంతపురము జిల్లాకు చెందిన యువకుడు బిసాతి భరత్ అజర్‌బైజాన్ రాజధాని బాకులో జరుగుతున్న ప్రతిష్ఠాత్మకమైన 9వ సి.ఐ.సి.ఏ యూత్ కౌన్సిల్ సమావేశం-2026లో భారతదేశం తరుపున ప్రాతినిధ్యం వహి ంచేందుకు ఎంపిక అయ్యారు.

భారత ప్రభుత్వ, యువజన వ్యవహారా లు, క్రీడల మంత్రిత్వ శాఖ, దేశవ్యాప్తంగా కేవలం ముగ్గురు యువకులను మాత్ర మే కాన్ఫరెన్స్ ఆన్ ఇంటరక్షన్‌కాంఫిడెన్స్, బిల్డింగ్ మేషర్స్ ఇన్ ఆసియ (సి.ఐ. సి.ఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సమా వేశానికి ఎంపిక చేయగా, వారిలో జిల్లాకు చెందిన బిసాతి భరత్ ఒకరు కావడం విశేషం. ఈ సందర్భంగా బిసాతి భరత్ మాటాడుతూ.. ఈ అరుదైన అవకా శాన్ని కల్పించిన కేంద్ర యువజన వ్యవహా రాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాల విభాగం, అంతర్జా తీయ సహకార విభాగం, సంబంధిత అధి కారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలి పారు. భారత దేశానికి ప్రాతి ని ధ్యం వహిస్తూ, వికసిత్ భారత్ లక్ష్యసాధనకు కట్టుబడి ఉన్న భారత యువత స్వరాన్ని ప్రపం చానికి వినిపించే బాధ్య తను మరింత సమర్థవం తంగా నిర్వ ర్తిస్తానని, దేశాభి వృద్ధికి, యువ నాయకుల మధ్య అంతర్జాతీయ సహకారాన్ని బలో పేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన పునరుద్ఘాటించారు.


బిసాతి భరత్

# నేటితో ముగియనున్న కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, అల్గారిథమ్స్, అప్లికేషన్స్ అండ్ హ్యాండ్స్‌ఆన్ ప్రాక్టీస్ కార్యక్రమం - ప్రిన్సిపాల్ డా.బండి రమేష్ బాబు

అనంతపురం, జూన్ 26 ప్రభాతవార్త బ్యూరో

పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం, జేఎన్‌టీయూఏ డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ అండ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, అల్గారిథమ్స్, అప్లికేషన్స్ అండ్ హ్యాండ్స్‌ఆన్ ప్రాక్టీస్" అనే అంశంపై ఐదు రోజుల అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం నేడు ముగియనుందని ప్రిన్సిపాల్ డా.బండి రమేష్ బాబు పేర్కొన్నారు. ముగింపు కార్యక్రమానికి జేఎన్‌టీయూఏ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఉన్నత విద్యలో కృత్రిమ మేధస్సు వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. అధ్యాపకులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నిరంతరం అవగాహన పెంపొందించుకొని, విద్యార్థులకు పరిశోధనతో కూడిన నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉంది. ఇలాంటి అధ్యాపక అభివృద్ధి కార్యక్రమాలు ఆ దిశగా ఎంతో ఉపయోగపడతాయి" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా.పల్లె కృష్ణ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ.. "కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అధ్యాపకులు స్వీకరించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి. ఇలాంటి అధ్యాపక అభివృద్ధి కార్యక్రమాలు బోధన, పరిశోధన, ఆవిష్కరణలకు కొత్త దారులు చూపుతాయి" అని పేర్కొన్నారు. ముగింపు కార్యక్రమానికి జేఎన్‌టీయూఏ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఈఎస్, చైర్మన్ డా.పల్లె కృష్ణ కిషోర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా.బండి రమేష్ బాబు, పీవీకేకే హెచ్‌ఓడీ (సీఎస్ఈ)డా.ఎం.మల్లికార్జున రావు, హెచ్‌ఓడీ (ఎంసీఏ) డా.సి.మంజునాథ్, డా.సి.వీణ, కార్యక్రమ సమన్వ యకర్త పాల్గొననున్నారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.


సన్మానిస్తున్న దృశ్యం

# ఘనంగా ముగిసిన మొహారం వేడుకలు

శింగనమల, జూన్ 26 ప్రభాతవార్త

గత 10 రోజులుగా శింగనమల మండల కేంద్రంలో జరుగుతున్న మొహారం వేడుకలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. మొహారం వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శింగనమల ఎస్ఐ కె.ప్రసాద్, సిఐ రాగిరి రామయ్య, ప్రత్యేకచర్యలు తీసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు గ్రామంలోని పుర వీధుల గుండా పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తుల నడుమ పీర్ల ఊరేగింపు జరిగింది. మతసామరస్యానికి ప్రత్యేకంగా నిలిచిన మొహారం సందర్భంగా వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన యువత కలిసి కట్టుగా చిందులు వేస్తూ ఉత్సవాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం భారీ జన సందోహం మధ్య జల్దికి తరలి వెళ్లాయి.


: జల్దిక ి వెళ్లిన పీర్లు

# తెలుగు రాష్ట్రాలకే మార్గదర్శకులు కళారత్న సింగమనేని నారాయణ

అనంతపురం, జూన్ 26 ప్రభాతవార్త బ్యూరో

సుప్రసిద్ధ కథా రచయిత కీర్తిశేషులు సింగమనేని నారాయణ రాసిన కథలు, వ్యాసాలు అధ్యయనం చేస్తే పలె జీవితంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను చిత్రీకరించి భుజాన వేసుకున్న రైతు పక్షపాతి, తెలుగు రాష్ట్రాలకు మార్గదర్శకులు, మంచి స్పృహ కలిగిన కథకుడని జిల్లా రచయితల సంఘ అధ్యక్షులు కొత్తపలి సురేష్ అన్నారు. సింగమనేని 83వ జయంతి సందర్భంగా తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సాహితీ మిత్రుల సహకారంతో స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రాంగణంలో జయంతి నిర్వహించి ఆయనను మననం చేసుకున్నారు. వేడుకలకు తెలుగు వెలుగు అధ్యక్షులు టివి రెడ్డి అధ్యక్షత వహించారు. చిత్రపటానికి పూల మాలవేసి పుష్పాంజలి ఘటించి జోహారు అర్పించారు. కార్యక్రమంలో సాహితీ పెద్దలు ఉమ్మడిశెట్టి సాహితీ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ రాధేయ, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, మానవతా రక్తదాతల కన్వీనర్ తరిమెల అమరనాథ రెడ్డి, అనంత సాహితీ ప్రస్థానం అధ్యక్షులు గంగిరెడ్డి అశ్వత్థరెడ్డి, పర్యావరణ పరిరక్షకులు భాషాలు మాటాడారు. కొందరు ప్రముఖులు పబిక్‌గా ఒకరకంగా వ్యక్తిగతంగా ఒకరకంగా ఉంటారు కానీ సింగ మనేని ఒకే రకంగా హుందాగా ఉండే వారిని వారి జ్ఞాపకాలను పంచుకున్నారు.

**గుడిపాటి సూర్యంకు సత్కారం :** కవి, రచయిత గుడిపాటి సూర్యం వర్తమాన రచయితగా సాహిత్య కృషి చేస్తున్నారు. తోటి రచయితలకు ప్రోత్సాహం అందించడం వలన కవులు రచయితలు ఎదుగుతారని సింగ మనేని అభిప్రాయం. ఆయన స్మృతిలో రచయిత గుడిపాటి సూర్యంకు తెలుగు వెలుగు సంస్థ శాలువతో సత్కరించి, పుస్తకా లను, జ్ఞాపికను బహూ కరించారు. కార్యక్రమంలో జిరసం నాయకులు కోటివన్నప్ప, గోసల నారా యణస్వామి, మధుర , మిద్దె మురళీకృష్ణ, గంగిరెడ్డి విశ్వనాథరెడ్డి కవులు డాక్టర్ అంకె రామలింగయ్య, లక్ష్మీశ్యాం, చంద్రశేఖరశాస్త్రి, ఉమర్ అలీషా సాహితీ సమితి అధ్యక్షులు షేక్ రియాజుద్దీన్, డాక్టర్ జుటూరు షరీఫ్, పూజారి ఈరన్న, సామాజిక సేవకులు ఆశ్రయ అనాథాశ్రయ నిర్వాహకులు ఎర్రగుంట కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, చెట ఈరన్న, చెట ప్రవీణ్, హరీష్, చలపతిరెడ్డి, నివాసులు తదితరులు పాల్గొన్నారు.


సింగమనేని నారాయణ జయంతి సందర్భంగా నివాళులు ఘటిస్తున్న దృశ్యం

## ప్రభుత్వం ఉపాధ్యాయులు విద్యార్థుల హేతుబద్ధతను వెలడించాలి

### - గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డెగావత రవీంద్రనాథ్

అనంతపురం న్యూటౌన్, జూన్ 26 ప్రభాతవార్త

పాఠశాలలో ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ పేరుతో అమలు చేస్తున్న ఉపాధ్యాయుల కేటాయింపు విధానంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డెగావత రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. 61 మంది విద్యార్థులున్న పాఠశాలకు 1 హెచ్‌ఎం + 4 ఉపాధ్యాయులు కేటాయిస్తూ, అదే నిష్పత్తిని 120 నుంచి 150 మంది విద్యార్థులున్న పాఠశాలలకు కూడా యదాతథంగా వర్తింపజేయడం ఏ ప్రాతిపదికపై నిర్ణయించారో ప్రభుత్వం వెలడించాలని ఆయన కోరారు. విద్యార్థుల సంఖ్య దాదాపు రెండింతలు ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల సంఖ్యలో ఎలాంటి పెంపు లేకపోవడం హేతుబద్ధతకు విరుద్ధమని అన్నారు. విద్యా నాణ్యతను పరిరక్షించాలంటే విద్యార్థుల వాస్తవ నమోదు ఆధారంగా ఉపాధ్యా యుల కేటాయింపును పునఃసమీక్షించి, అవసరమైన చోట అదనపు ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# డీఎస్సీ-2003 ఉద్యోగులకు ఓపీఎస్ అమలు నిర్ణయం చారిత్రాత్మకం

## - అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎన్‌టిఏ నాయకులు

అనంతపురం న్యూటౌన్, జూన్ 26 ప్రభాతవార్త

డీఎస్సీ-2003 ద్వారా నియమితులైన 10,715 మంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం (ఓపిఎస్) వర్తింపజేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయానికి హర్షం వ్యక్తం చేస్తూ, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌ని వారి కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాటాడుతూ..ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ నిర్ణయం వేలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబాలకు భవిష్యత్ భద్రతను కల్పించే గొప్ప సంక్షేమ నిర్ణయమని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఈ నిర్ణయాన్ని హర్షిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పతకమూరి నివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నేసే రవి, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి మేకల సురేంద్రబాబు, రాష్ట్ర నాయకులు, ఓబులేసు, గంగాద్రి, రామ్మూర్తి, మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# స్వర ఆసుపత్రిలో క్యాన్సర్ వైద్య విభాగం ప్రారంభం..

అనంతపురం కల్చరల్, జూన్ 26 ప్రభాతవార్త

బెంగళూరులోని అపోలో ఆసుపత్రుల క్యాన్సర్ వైద్య చికిత్సా విభాగం, కర్ణాటక ప్రాంత క్యాన్సర్ విజ్ఞాన విభాగ అధిపతి, సీనియర్ వైద్య నిపుణులు, విద్యా సలహాదారు డాక్టర్ విశ్వనాథ్.ఎస్ నేతృత్వంలో స్థానిక స్వర ఆసుపత్రిలో ఒక ప్రత్యేక క్యాన్సర్ ఔట్‌పేషెంట్ విభాగాన్ని (బహిరంగ రోగుల విభాగం) ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు తెలియజేస్తూ.. అపోలో ఆసుపత్రి వైద్య నైపుణ్యం, సహకారంతో ప్రారంభమైన ఈ కొత్త విభాగం ద్వారా అనం తపురం, చుట్టుపక్కల జిల్లాల ప్రజలకు సేవలు అందించనున్నట్లు తెలిపారు. నేతృత్వంలోని స్వర ఆసుపత్రి, అపోలో ఆసుపత్రులతో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా రోగులకు వైద్య సేవలను అందించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. 18 ఏళ్లకు పైగా అనుభవం కలిగి, ఎండీ ఆండర్సన్ క్యాన్సర్ కేంద్రం నుంచి ప్రత్యేక వైద్య శిక్షణ పొందిన ఎండీ, డీఎం బంగారు పతక విజేత డాక్టర్ విశ్వనాథ్.ఎస్ నెలకు రెండుసార్లు స్థానికంగా రోగులకు వైద్య సంప్రదింపులు అంది స్తారన్నారు. బెంగళూరులోని వైద్య నిపుణులు డాక్టర్ శిరీష్ కుమార్ కూడా ఈ బృందంలో చేరనున్నారు. సమాజానికి ప్రత్యేక క్యాన్సర్ వైద్య సంరక్షణను అందించడమా లక్ష్యం" అని స్వర ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ఎం. శ్వేత తెలిపారు. డాక్టర్ విశ్వనాథ్ నాయకత్వం, అపోలో వైద్య బృందం పటిష్టమైన మద్దతుతో ప్రపంచ స్థాయి క్యాన్సర్ సంరక్షణ ఇప్పుడు అనంత పురంలోనే నిరంతరం అందుబాటులో ఉంటుందని ఆమె వివరించారు. శ్రీ స్వరా హాస్పి టల్ (చిరునామా: 63916, 3వ క్రాస్ రోడ్, మారుతి నగర్, అనం తపురం, ఆంధ్రప్రదేశ్ 515001) వద్ద ప్రతి శుక్ర, శనివారాల్లో ఓపీడీ సేవలు అందు బాటులో ఉంటాయి. ముందస్తు అపాయింట్‌మెంట్ కోసం రోగులు +91 77994 45137 నంబర్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చు అని వారు తెలిపారు.


మాట్లాడుతున్న స్వర ఆసుపత్రి, బెంగళూరు క్యాన్సర్ వైద్య నిపుణులు

## ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించాలి - ఎమ్మెల్యేకు ఫ్యాప్టో వినతి

అనంతపురం న్యూటౌన్, జూన్ 26 ప్రభాతవార్త

ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నుండి చట్ట సవరణ ద్వారా మినహాయింపు కల్పించాలని ఫ్యాప్టో నాయకులు శాసనసభ్యులు దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ..సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు టెట్‌కు సిద్ధం కావాలంటే అధిక సమయం వెచ్చించాల్సి వస్తుందని, ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు అంత సమ యం కేటాయించడం సాధ్యంకాదని తెలిపారు. ప్రభుత్వం టెట్‌ను తప్ప నిసరి చేస్తే, ఉపాధ్యాయులు పరీక్షల కోసం సెలవులు తీసుకుని సిద్ధం కావా ల్సిన పరిస్థితి ఏర్పడి, విద్యార్థుల బోధ నపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ శ్రీనివాసనాయక్, సెక్రటరీ జనరల్ పురుషోత్తం, కోచైర్మన్లు ఓబలేసు, లింగమూర్తి, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ కోటేశ్వరప్ప, రమణారెడ్డి, నరేష్ కుమార్, కార్యవర్గ సభ్యులు, రవీంద్రతో పాటు ఫ్యాప్టో అనుబంధ సంఘాల నాయకులు సూర్యుడు, వెంకట సుబ్బయ్య, రాజశేఖర్, శంకరమూర్తి, హనుమంతు, అశోక్ నాయక్, వజీర్ భాష, సూర్యనారాయణ, ఎర్రిస్వామి, మహేశ్వర్ గౌడ్, నరసింహులు, విజయ్ కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నేతలు

# డెఫ్ క్రికెట్ టోర్నీ విజేతగా కర్ణాటక జట్టు

అనంతపురం సిటీ, జూన్ 26 ప్రభాతవార్త

ఆర్డిటి క్రీడా మైదానంలో ఐదు రోజులుగా జరుగుతున్న టి20 నేషనల్ డెఫ్ క్రికెట్ టోర్నీ ఛాంపియన్ షిఫ్‌గా కర్ణాటక జట్టు నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో కర్ణాటక, హర్యాన జట్టులు తలపడగా, హర్యాన జట్టు 74 పరుగులకు ఆల్ ఔట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన కర్ణాటక జట్టు 13.5 ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి, 78 పరుగులు సాధించి విజేతగా నిలిచింది. విజేతలకు డిఆర్‌ఓ మలోలాతోపాటు డెఫ్ క్రికెట్ అసోషియేషన్ ప్రతినిధులు బహుమతులను ప్రదానం చేశారు. అదే విధంగా టోర్నీలో ప్రతి భ కనబర్చిన క్రీడా కారులకు సైతం ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ డెఫ్ క్రికెట్ అసోషియేషన్, ఏడిసిఏ ప్రతినిధులు పాల్గొన్నారు.


ఛాంపియన్ షిప్‌తో కర్ణాటక జట్టు

# పిఆర్‌లో 13 మందికి డిఈఈలుగా పదోన్నతులు

## - హర్షం వ్యక్తం చేసిన యూనియన్ నేతలు

అనంతపురం సిటీ, జూన్ 26 ప్రభాతవార్త

పంచాయితీ రాజ్ డిఈఈలుగా జిల్లాలో 13 మందికి పదోన్నతులు కల్పిస్తూ పిఆర్‌ఎస్‌ఈ చిన్న సుబ్బ రాయుడు ఉత్తర్వులను అందజేశారు. జిల్లాలో గ్రాడ్యుయేట్ ఏఈలుగా సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న పదోన్నతులకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో అసోషియేషన్ నేతలు సుదీర్ఘ పోరాట ఫలిత oగా రాష్ట్ర ప్రభుత్వం ఈఎంసి బాలునాయక్ చొరవతో 20 ఏళ్ల తర్వాత ఏఈఈలకు డిఈఈలుగా పదోన్నతులు లభించాయి. జిల్లా నుంచి లక్ష్మినారాయణ, గోపాల్‌నాయక్, ప్రసాద్, పాండురంగారెడ్డి, లక్ష్మినారాయణ, రామాంజినేయులు, వెంకటేషులు, ఓబుళదాసు, వరప్రసాద్, సి.ఓబుల దా సు, విశ్వనాథ్‌రెడ్డి, అరుణకుమార్, సిఆర్ మధులకు పిఆర్‌ఎస్‌ఈ చిన్న సుబ్బరాయుడు శుక్రవారం డిఈలుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా అసోషియేషన్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. తమకు పదోన్నతులు కల్పించిన ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.


డిఈఈలుగా పదోన్నతుల ఉత్తర్వులు అందుకుంటున్న ఉద్యోగులు

# యువతకు డ్రగ్స్ వద్దు.. భవిష్యత్తు ముద్దు..

## - మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో డిఎస్‌పి శివనారాయణస్వామి

కదిరి, జూన్ 26 ప్రభాతవార్త

యువత డ్రగ్స్‌కు అలవాటు పడి వారి భవిష్యత్తును నావనం చేసుకోవద్దని కదిరి డిఎస్పీ శివనారా యణ స్వామి పేర్కొన్నారు. శుక్రవారం అంత ర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక రోడ్లు, భవనాల అతిథి గృహం నుంచి వేమా రెడ్డి సర్కిల్ టవర్ క్లాక్ మీదుగా అంబేద్కర్ కూడలి వరకు కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు వ్యతిరేక నినాదాలు చేస్తూ ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు వాటి భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యువత సమాజ నిర్మా ణంలో పోషించాల్సిన బాధ్యత గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్ర మంలో పట్టణ సీఐ డివి.నారాయణరెడ్డి, ఎక్సైజ్ సిఐ వీరారెడ్డి, ఎస్ఐ శ్రీధర్, రెడ్స్ సంస్థ ప్రతినిధి భానుజా, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


మాదక ద్రవ్యాలపై మాట్లాడుతున్న డిఎస్‌పి శివనారాయణ స్వామి

# అరకొరగా విద్యార్థి కిట్స్...!

**( మొదటి పేజీ తరువాయి )** చాలామంది విద్యార్థులు పాత యూనిఫామ్స్, కొందరు కలర్ డ్రెస్సులతో, పాత బ్యాగ్స్ తో పాఠశాలలకు వెళ్తున్నారు. 202626 నూతన విద్యా సంవత్సరం ఈనెల 12న ప్రారంభమైంది. పాఠశాలలు ప్రారంభమైన రోజు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర విద్యార్థి కిట్స్ ను విద్యార్థులకు అందజేయాలని ప్రభుత్వము విద్యాశాఖను ఆదేశించింది. అందులో ఒక విద్యార్థికి మూడు జతల యూనిఫామ్, ఒక బ్యాగ్, ఒక జత షూ, సాక్స్ ,ఒక బెల్టు, నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్, ఒక ఆక్స్ఫర్డ్ డిక్షనరీ, ఒక పిక్టోరల్ డిక్షనరీ, వర్క్ బుక్స్ కలిపి కిట్స్ మాదిరిగా నూతన విద్యా సంవత్సరం ప్రారంభం రోజు విద్యార్థులకు అందజేయాల్సి ఉంది. కానీ అనంతపురం జిల్లాలో 1వ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఒక లక్ష 95 వేల 823 యూనిఫామ్స్ కావాలని సమగ్రశిక్ష అధికారులు ఇండెంట్ పెట్టడం జరిగింది. కానీ ఇప్పటివరకు కేవలం 58970 యూనిఫామ్స్ మాత్రమే పంపిణీ చేశారు. ఇంకా 136853 యూనిఫామ్స్ పంపిణీ చేయాల్సి ఉంది. అంతేకాకుండా 195823 బ్యాగ్స్ కావాలని ఇండెంట్ పెడితే అందులో కేవలం 107787 బ్యాగ్స్ మాత్రమే పంపిణీ చేశారు. మిగిలిన 88036 బ్యాగ్స్ రావాల్సి ఉంది. అదేవిధంగా 195823 మంది విద్యార్థులకు షూ కావాలని ఇండెంట్ పెడితే అందులో 176967 మాత్రమే విద్యార్థులకు పంపిణీ చేశారు. మిగిలిన 18856 మంది విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉంది. అలాగే బాలురు అందరికీ, ఒకటి నుంచి 5వ తరగతి బాలికలకు 137142 బెల్టులు కావాలని ఇండెంట్ పెడితే అందులో 124806 మాత్రమే విద్యార్థులకు పంపిణీ చేశారు. మిగిలిన 12336 మంది విద్యార్థులకు పంపిణీ చేయాల్సి. అలాగే 823094 టెస్ట్ బుక్స్ కావలసి ఉంటే అందులో 788380 మాత్రమే పంపిణీ చేశారు. ఇంకా 34714 పంపిణీ చేయాల్సి ఉంది. అలాగే 177726 వర్క్ బుక్స్ కావలసి ఉంటే అందులో 173338 పంపిణీ చేశారు. ఇంకా 4388 రావాల్సి ఉంది. అలాగే ఆరవ తరగతి విద్యార్థులు అందరికీ 20006 ఆక్స్ఫర్డ్ డిక్షనరీలు పంపిణీ చేశారు. అలాగే ఒకటవ తరగతి విద్యార్థులు అందరికీ పిక్టోరల్ డిక్షనరీలు పంపిణీ చేశారు. పాత యూనిఫామ్స్ తో పాఠశాలలకు: జిల్లాలో 195823 మంది విద్యార్థులలో కేవలం 58970 మంది విద్యార్థులకు మాత్రమే యూనిఫార్మ్స్ క్లాత్ పంపిణీ చేశారు. మిగిలిన విద్యార్థులకు ఇంకా పంపిణీ చేయలేదు. దీంతో 136853 మంది విద్యార్థులు గత ఏడాది ఇచ్చిన యూనిఫామ్స్ తో, కొందరు రెండు మూడేళ్ల క్రితం ఇచ్చిన అప్పటి యూనిఫామ్స్ తో, మరికొందరు కలర్ డ్రెస్ తో పాఠశాలకు వెళ్తున్నారు. పాఠశాల ప్రారంభం రోజు వంద శాతం విద్యార్థి విద్యార్థి కిట్స్ పంపిణీ చేయాల్సిన విద్యాశాఖ అరకొరగాని పంపిణీ చేయడం పలు విమర్శలకు దారితీస్తుంది. కనీసం ఇప్పటికైనా విద్యాశాఖ స్పందించి విద్యార్థులందరికీ కిట్స్ పంపిణీ చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సమగ్ర శిక్ష అధికారుల వివరణ: వారంలోపు అందరు విద్యార్థులకు వంద శాతం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర విద్యార్థి కిట్స్ పంపిణీ చేస్తామని అనంతపురం సమగ్ర శిక్ష అధికారులు తెలిపారు.

**CHANGE OF NAME**

I **M.L.N.Prasad** S/o late M.Sathyanarayana, aged 58 years, Residing at D.No.14-89A, 1st Floor, Beside Star Health Insurance Office, Kamalanagar, Anantapurmu City & Dist. Andhra Pradesh. M.L.N.Prasad Changing my name from **M.L.N.Prasad** (Old Name) **LAKSHME NARAYN SWWAMY** (New Name). Hence forth, I am being called as **LAKSHME NARAYN SWWAMY** for all purpose.

04ATP26.qxd:04ATP26.qxd 27/06/26 11:38 PM Page 1



# ఓటర్ల జాబితా సవరణలో వేగం పెంచాలి : ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు

రాయదుర్గం జూన్ 26 ప్రభాతవార్త

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ప్రారంభమై 11 రోజులవుతున్నందున పార్టీ పరంగా బీఎల్ఏలు చురుగ్గా పనిచేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీని వాసులు పిలుపునిచ్చారు. రాయదుర్గంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మం డలాల వారీగా ఇప్పటి వరకు అప్‌లోడ్ చేసిన ఓటర్ల వివరాలను సమీక్షించి చదివి వినిపించారు. ఇప్పటికే మూడో వంతు అప్లోడ్ చేయాల్సి ఉండగా చాలా మంది వెనుకబడ్డారన్నారు. ఇంకా సమయం ఉందనే భావన కనిపిస్తోందన్నారు. కొన్ని మండలాలు మరింతగా వెనుకబడి ఉన్నాయని, చురుకుగా పని చేయకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు తెలుగుదేశం పార్టీ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయని తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబి తాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ఓటు వేయాలనే ఆసక్తి ఉన్నా..! జాబితాలో పేరు లేకుంటే ప్రజా స్వామ్య హక్కు వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని గుర్తు చేశారు. ముందుగా వారి పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటర్ పేరును జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని మరోసారి హెచ్చరించారు. కనీసం ఇప్పటి నుండి అయినా ఓటర్ల సవరణ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని ఎప్పటి కప్పుడు జాబితా అప్లోడ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచిం చారు. ప్రతి కార్యకర్త నేరుగా ఓటర్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను బలంగా వినిపించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులు స్వయ ంగా కూటమికే ఓట్లు వేస్తారనే భావన సరైనది కాదన్నారు. ప్రజల కోసం మనం చేసిన అభివృద్ధి, మంచిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వెనుకబడితే వాటి ఫలితాలు ఇబ్బందికరంగా ఉంటాయని పదేపదే గుర్తు చేశారు. రాజకీయ కుట్రలపై అప్రమత్తత అవసరం వివిధ పార్టీల ముసు గులో ఉన్న కొంతమంది తెలుగుదేశం పార్టీకి ఇబ్బందులు కలిగించే ప్రయ త్నాలు చేస్తున్నాయని, వాటిని సమర్థవంతంగా ఎప్ప టికప్పుడు తిప్పికొ ట్టాలన్నా రు. రాయదుర్గం పట్టణంలో ఇటీవల కళ్యాణదుర్గం ప్రాం తానికి చెందిన ఓ తెలుగుదేశం పార్టీ నాయ కుడుపై జరిగిన దాడిని ఆయన ఈ సంద ర్భంగా ఉదా హరిం చారు. తనకు, తెలుగు దేశం పార్టీకి ఏమాత్రం సంబ ంధంలేని ఈ దాడిని కొందరు స్థానిక బిజెపి, వైసిపి, కాంగ్రెస్ నాయకులు కలిసికట్టుగా టిడి పిని అప్రతిష్టపాలు చేయ టానికి ప్రయ ంత్నం చేశారని వివరించారు. వాస్తవంగా ముందునుంచి బిజ ెపిలో ఉన్న నాయకులతో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని మంచి సంబంధాలు కొనసా గుతున్నాయన్నారు. పార్టీ సిద్ధాంతం ప్రకారం వారంతా పని చేసుకుంటూ వెళ్తార న్నారు. అయితే గత ఐదేళ్లలో స్థానికంగా అనేక అక్రమాలకు పాల్పడి ఆతరు వాత వేరే పార్టీ ముసుగు వేసుకున్న వారితోనే సమస్యలన్నారు. పార్టీ ప్రతిష్ట దెబ్బతిసేలా రాజకీయ శక్తులు కలిసి పనిచేస్తున్నాయని, ఇలాంటి విష యం లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో అప్రమత్తంగా వ్యవ హరించాలని సూచించారు. ఇలాంటి రాజకీయ కుట్రలను గుర్తించి ఎప్పటి కప్పుడు తిప్పి కొట్టకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలియజేశారు. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు రాబో యే 2029 ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకుని ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో బలంగా పనిచేయాలన్నారు. రాయ దుర్గం కోటపై తెలుగుదేశం పార్టీ విజ యపతాక కలకాలం వెలుగులీనేలా సమిష్టి కృషి చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కాదలూరు మోహన్ రెడ్డి, కాలువ సన్నన్న, వన్నారెడ్డి, కురుబ హను మంతు, క్లస్టర్ ఇంఛార్జిలు పోరాళ్ల పురుషోత్తం, ఇనాయత్, మాజీ కౌన్సిలర్ ్నటకశాల హనుమంతు, కడ్డిపూడి మహబూబ్ బాషా, పూజారి శివ, మాజీ కన్వీనర్ కురుబ గిరిమల్లప్ప, కావలి రవి, నాయకుల తిప్పేస్వమి, పోరాళ్ల ధనర్జున తదితరులు పాల్గొన్నారు.

# తాడిపత్రిలో దాడులకు, అక్రమ కేసులకు జడిసేది లేదు

## : ఉద్యోగం చేయడమంటే జేసీ ఇంటి వద్ద ఊడిగం చేయడమా..?

## : పోలీసులపై తీవ్ర విమర్శలు గుప్పించిన కేతిరెడ్డి పెద్దారెడ్డి


పట్టణ సీఐ,ఎస్సైల ఎదుట కార్యకర్తలతో కలసి నిరసనలో పాల్గొన్న కేతిరెడ్డి పెద్దారెడ్డి


వైకాపా శ్రేణులతో కలసి రోడ్డుపై బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి


పోలీసులకు, వైకాపా శ్రేణులకు మధ్య తోపులాట


పెద్దారెడ్డిని అనంతపురానికి తరలించకుండా అడ్డుగా ఉంచిన బెంచీలు

తాడిపత్రి, జూన్ 26, ప్రభాతవార్తః

తమ పార్టీ అధినేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అండదండలు, ఆశీస్సులు ఉన్నంత వరకు తాడిపత్రిలో జరుగుతున్న దాడులకు, అక్రమ కేసులకు జడిసేది లేదని, పోలీసులు ఉద్యోగం చేయడమంటే జేసీ ఇంటి వద్ద ఊడిగం చేయడమా అంటూ వైకాపా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వ్యాఖ్యానించారు. తాడిపత్రిలో తెదేపా నాయకులు చేస్తున్న వరుస దాడులకు నిరసనగా స్థానిక గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం పెద్దారెడ్డి తలపెట్టిన సామూహిక దీక్షను పోలీసులు భగ్నం చేశారు. ఉదయాన్నే పోలీసు అధికారులు తమ సిబ్బందితో భగత్ సింగ్ నగర్‌లోని పెద్దారెడ్డి ఇంటిని చుట్టుముట్టారు. ఆయన ఇంటి నుంచి గాంధీ విగ్రహం వద్దకు రాకుండా ఆయన ఇంటి చుట్టూ ఉన్న మార్గాలను మూసివేశారు. దీంతో అప్పటికే తనతో పాటు ఉన్న 70 మందికి పైగా కార్యకర్తలతో ఇంటి నుంచి బయటికి వచ్చి సమీపంలోని రోడ్డుపై పెద్దారెడ్డి బైఠాయించారు. పోలీసుల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న నాయకులు పేరం స్వర్ణలత, ఆర్సీ ఓబుళరెడ్డి, సజ్జలదిన్నెరాజు, రామేశ్వరరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రవితేజరెడ్డి, పద్మనాభరెడ్డి, పెద్దపేట లక్ష్మిదేవి తదితరులతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 400 మంది కార్యకర్తలు పెద్దారెడ్డి ఇంటి వద్దకు చేరుకున్నారు. పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ పరిస్థితిని వేడెక్కించారు. సివిల్ దుస్తుల్లో వచ్చిన సీఐ ఆరోహణరావు, ఎస్సై గౌస్‌లు పెద్దారెడ్డి ఎదుటే నిల్చొని పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు వివరిస్తూ నిరసన విరమించమని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీస్తుందనే ఉద్దేశంతో ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు, పోలీసులకు తోపులాట చోటు చేసుకుంది. పోలీసుల సూచనలను పాటించకపోతే పెద్దారెడ్డిని అనంతపురానికి తరలిస్తామని ఏఎస్పీ సూచించడంతో కార్యకర్తలు వాహనాలు వెళ్లకుండా సిమెంటు బెంచీలను అడ్డుగా ఉంచారు. దీంతో పోలీసులు లాఠీ చార్జ్ చేశారు. వైకాపా నాయకులు కార్యకర్తలకు నచ్చచెప్పి గొడవ సద్దుమణిగేలా చేశారు. ఏఎస్పీ సూచన మేరకు పెద్దారెడ్డి దీక్ష విరమించి ఇంటిలోపలికి వెళ్లారు. అనంతపురం నుంచి తాడిపత్రికి బయలుదేరిన జిల్లా వైకాపా నాయకులను పోలీసులు అరెస్టు చేసి ఆయా స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా పెద్దారెడ్డి మీడియాతో మాట్లాడుతూ తాడిపత్రిలో విచ్చల విడిగా గంజాయి విక్రయాలు సాగుతుండటంతోనే నేరాలు పెరిగాయని, తమ కార్యకర్తలపై దాడులు జరిగితే పట్టించుకునే పోలీసులే లేరని, తాము కూడా ఇక నుంచి కోర్టుల ద్వారానే కేసులు నమోదు చేసేలా పోలీసులపై ఒత్తిడి పెంచుతామని, అప్పటికీ కేసులు నమోదు చేయకపోతే వాటిని సాక్ష్యంగా చూపి మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసులు నమోదుచేసి చట్టపరమైన చర్యలకు పూనుకుంటామన్నారు. తనకు మద్దతు తెలిపేందుకు వస్తున్న జిల్లా నాయకులను కూడా జేసీ బెదిరించే ధోరణిలో వెళుతుంటే జిల్లా పోలీసు అధికారులు చోద్యం చూస్తుండటం విడ్డూరంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

# నిరుపేదలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది మంత్రి సవిత .

## 121 మందికి రూ.1కోటి 15 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


3 సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి

పెనుకొండ జూన్ 26 ప్రభాతవార్త

వైద్య ఖర్చుల్లో ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిరుపేదలకు అండగా నిలుస్తూ పనిచేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. పెనుకొండ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం పెనుకొండ నియోజకవర్గానికి చెందిన121 మంది లబ్దిదారులకు రూ.1 కోటి15 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మంత్రి సవిత చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబ డిన కుటుం బాలకు వైద్య చికిత్సల సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రజల కష్టకాలంలో ప్రభుత్వం వారి పక్షాన నిలబడి అవసరమైన సహాయాన్ని అందిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజ లకు అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి సవిత స్పష్టం చేశారు. పెనుకొండ నియోజకవర్గ ప్రజల సమస్యలను ఎప్పట ికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, సంక్షేమ పాలన ద్వారా ప్రతి కుటుంబానికి భరోసా కల్పిం చడమే తమ లక్ష్యమని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, లైవ్ స్టాక్ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేష్ , మండల కన్వీనర్లు ఈశ్వర్ ప్రసాద్ , వెంకటేశులు, గోవిందరెడ్డి, బాలకృష్ణ చౌదరి, నరహరి, పెనుకొండ అర్బన్ టిడిపి కన్వీనర్ శ్రీరాములు, ఇస్లాపురం సింగల్ విండో చైర్ పర్సన్ పోతిరెడ్డి, పాలసముద్రం సింగిల్ విండో చైర్ పర్సన్ బెలాల చెరువు చంద్ర, మాజీ సింగల్ విండో అధ్యక్షులు లక్ష్మీనారాయణ రెడ్డి, మాజీ జెడ్పిటిసి బాలాజీ, పార్టీ నాయకులు నీరుగంటిచంద్ర, నాగే నాయక్, చాకర్లపల్లి శ్రీరాములు, ప్రవీణ్ రెడ్డి, అమ రాన్ మారుతి, దొడ్డయ్య, ప్రభంజన్ స్వామి, సాయిప్రసాద్, అమ్మవారిపల్లి వాసుదేవ రెడ్డి, మోటర్ పల్లి నాగేంద్ర , శంకర, కార్యకర్తలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో చరిత్ర సృష్టించాం

## - కష్టపడి ఎమ్మెల్యే స్థాయికి వచ్చా.. - మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

కదిరి, జూన్ 26 ప్రభాతవార్త

కదిరి నియోజకవర్గంలో ఒకే పార్టీ గుర్తు మీద ఒకే నియోజకవర్గంలో ఐదు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి రాజకీయాల్లో చరిత్ర సృష్టించానని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను విమర్శించేస్థాయి నీకు లేదంటూ వైసిపి నాయకులు చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే స్పందించారు. శుక్రవారం స్థానిక రోడ్లు, భవనాల అతిథి గృహంలో మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. మా నాన్న ముఖ్యమంత్రి కాదు, మా తాత గ్రామ సర్పంచు కాదు.. అయినా కష్టపడి ప్రజలతో మమేకమై ఎమ్మెల్యే స్థాయికి వచ్చానని, నా స్థాయి గురించి మ ఆట్లాడుతున్న వైసిపి నాయకులు ఒక్కసారి వారి స్థాయి ఏంటో తెలుసుకోవాలని సూటిగా ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఒక చరిత్ర సృష్టించి ఉమ్మడి రాష్ట్రంలో కదిరి ఎమ్మెల్యేగా పని చేశానని, విభజన ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎమ్మెల్యేగా కొనసాగుతున్నాన్నారు. నేను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి కనీసం ఎమ్మెల్యే కూడా కాదని నన్ను విమర్శించే వైసిపి నాయకులు ఒక్కసారి గుర్తించుకోవాలన్నారు.

మా జగన్‌పై ఈగ కూడా వాలనివ్వమని చెబుతున్న నాయకులు ఏకంగా ఈడినే వాలిందని ఏం చేస్తారంటూ ఎద్దేవా చేశారు. జగన్‌పై ఈడి దాడులు జరిపి అధికారికంగా 43వేల కోట్లు రూపాయలు అటాచ్ చేస్తూ కేసులు నమోదు చేసిందని అది మీ నాయకుడి చరిత్ర అన్నారు. ఎన్నికల ముందు నాపైన క్రిమినల్ కేసులు ఉన్నాయని ఆరోపణలు చేసిన వైసిపి నాయకుల సవాల్‌ను స్వీకరించి నాపైన ఉన్న కేసులు కొట్టి వేసిన అనంతరమే ఎన్నికలలో పోటీ చేసి గెలిచానన్నారు. మీకు దమ్ము ధైర్యం ఉంటే మీ నాయకుడు జగన్ తనపై ఉన్న కేసులను త్వరగా తేల్చాలని కోర్టులో పిటీషన్ వేయగలమని చెప ్పగలరా అని వైసిపి నాయకులకు ఎమ్మెల్యే సవాల్ విసిరారు. అలాగే సోలార్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా వైసిపి నాయకులు ధర్నా చేయడం సిగ్గు చేటు అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే సోలార్ ప్రాజెక్ట కొనసాగు తుందన్నారు. ఎనేబుల్ ఎనర్జీ మీద ప్రపంచం పరుగులు పెడుతోందని, దేశ ప్రధాని కొన్ని లక్ష్యాలను నిర్దేశించుక ున్నార న్నారు. అందుకు అను గుణంగా ప్రభుత్వాలు నిర్ణయా లు తీసు కున్నారని, గడిచిన కా లంలో జగన్ అధికారంలో ఉన్న ప్పుడు ఎన్‌పి కుంట లో 1500 మెగా వాట్ల ప్రాజెక్టు పూర్తి అయిందని, అప్పుడు ఏం చేస్తున్నారని వైసిపి నాయకులు ఎమ్మెల్యే కందికుంట నిలదీశారు. ప్రభుత్వ భూములకు ప్రభుత్వ జీవో వచ్చిందని దీంతో వైసిపి నాయకులు రాద్ధాంతం చేయడం తగదన్నారు. వీరికి జెండా ఉంది కానీ, అజెండా లేదని దుయ్యబట్టారు. సోలార్ ప్రాజెక్టు ద్వారా కోట్ల రూపాయల నిధులు సోషల్ రెస్పాంబులిటీ కిం ద కదిరి నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అనవసరంగా వైసిపి నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే సహించే ప్రసక్తి లేదని వాస్తవాలను ప్రజలు అర్థం చేసుకోవాలని ఎమ్మెల్యే కందికుంట స్పష్టం చేశారు.

# ఉద్యోగులకు ఓపీఎస్ అమలుపై ఉపాధ్యాయుల హర్షం

## ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం - కృతజ్ఞత సభ ఉద్యోగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు.


సురేంద్రబాబును ఘనంగా సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు.


ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, ఉపాధ్యాయులు.

కళ్యాణదుర్గం, జూన్ 26 ప్రభాతవార

:2004కు ముందు నియమితులైన ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయడంపై కళ్యాణదుర్గంలో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజావేదికలో ఉపాధ్యాయులు కృతజ్ఞత సభ నిర్వహించి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, ము ఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశా రు. ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ, ఎన్నికల హామీలను అమలు చేస్తూ ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టు బడి ఉందన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ–117 వల్ల విద్యా వ్యవస్థకు ఇబ్బందులు ఎదురయ్యాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని రద్దు చేసి ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకుందని తెలిపారు. అలాగే డీఎస్సీ నిర్వహించి 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. ఓపీఎస్ అమలుతో ప్రతి అర్హ ఉపాధ్యా య కుటుంబానికి కోట్ల రూపాయల మేర ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే అన్నారు. బీటీపీ సాగునీటి పథకాన్ని పూర్తి చేయడానికి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని, పథకం పూర్తయి నీరు అందిన రోజు ప్రజలు ప్రభుత్వ సేవలను గుర్తుంచుకుంటారని చెప్పారు. అనంతరం రాష్ట్ర రాజకీ యాలపై మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ విధానాలను విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# .ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం అండ- అర్హులైన ప్రతి బాధితుడికి సీఎం సహాయనిధి అందజేస్తున్న ప్రభుత్వం


ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, జూన్ 26 ప్రభాతవార్తః

ఎద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక చేయూత అంది స్తోందని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. శుక్రవారం కళ్యాణదుర్గంలోని ప్రజా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బం దులతో వైద్య చికిత్సలు చేయించుకున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అం డగా నిలుస్తోందన్నారు. అర్హులైన బాధితులు దరఖాస్తు చేసుకున్న వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పంది ంచి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నారని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 25 మంది లబ్ధిదారులకు రూ.10,48,290 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అధికారులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు

# రజకుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం మంత్రి సవిత

## రజక ఆకాంక్ష సభకు మంత్రి సవితను ఆహ్వానించిన రజక సంఘం


రజక ఆకాంక్ష సభకు మంత్రి సవిత ను ఆహ్వానిస్తున్న దృశ్యం

పెనుకొండ జూన్ 26 ప్రభాతవార్త

రజకుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. జులై 12 న గుత్తి పట్టణంలో నిర్వహించనున్న రజక ఆకాంక్ష సభ6 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొనాలని మంత్రి సవితను రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్ పర్సన్ సావిత్రి శుక్రవారం పెనుకొండ పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రజకులు . మాట్లాడుతూ, రజకుల సంక్షేమం, సామాజిక అభ్యున్నతి, వృత్తి అభివృద్ధి అంశాలపై చర్చించేందుకు ఈ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రజక సమాజానికి మార్గనిర్దేశం చేయాలని మంత్రి సవిత ని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో బీసీ వర్గాల సంక్షే మానికి అత్యంత ప్రాధా న్యత ఇస్తోందని అన్నారు. రజ కుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు మరింత ఫలప్రదంగా అమలయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. త్వరలో చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వ హిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూ దందాలు మానుకోండి..!

## గుజిరిలోనూ కూటమికి కమిషన్లు వైసిపి వేణురెడ్డి ఆరోపణలు


మీడియాతో వేణురెడ్డి

హిందూపురం జూన్ 26 ప్రభాతవార్త

హిందూపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి చెందిన వారు చేస్తున్న భూ దందాలు ఇప్పటికైనా ఆపివేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత గుడ్డంపల్లి వేణు రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ దీపిక కార్యాలయంలో శుక్రవారం ఉదయం మీడియా సమావేశం నిర్వహించారు. వేణు రెడ్డి మాట్లాడుతూ చిలమత్తూరు మండలం చాగలేరు పంచాయతీ మోతకపల్లి గ్రామంలో కోట్లాది రూపాయల విలువైన భూమి విషయంలో అనర్హులకు అక్కడి తాసిల్దార్ వన్ బి అడంగల్ నిబంధనలకు విరుద్ధంగా జారీ చేయగా ఎమ్మెల్యే కార్యాలయం అండగా నిలిచిందని ఆరోపించారు. దీనికి సంబంధించి స్టాంపు పేపర్లు, రిజిస్ట్రేషన్ కానీ వీలునామా పత్రాలు మొదలగు ఆధారాలను వేణు రెడ్డి మీడియా ఎదుట ప్రదర్శించారు. ఆధారాలు చూపించాలని టిడిపి వారు గతంలో ప్రశ్నించారని భూదందాలకు ఇదిగో ఆధారాలు అంటూ ఆయన బదులిచ్చారు. ఈ స్థలానికి సంబంధించి జూనియర్ అడ్వకేట్ వర్షా రెడ్డి మాట్లాడుతూ ఈ జాగా తమదేనని దీనిలో రెవెన్యూ, పోలీసులు తమను బెదిరిస్తున్నారని వీరికి టిడిపి నాయకులు అండగా ఉన్నారని దీంతో తాము వైసిపి కార్యాలయాన్ని ఆశ్రయించామన్నారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. మరోవైపు హిందూపురం పట్టణంలో ముస్లిం మైనార్టీలు గుజిరి వ్యాపారంతో ఎన్నో తరాలుగా ఆధారపడ్డారని సేకరించిన టన్నుల గుజిరేని తూముకుంట పారిశ్రామిక వాడ ఫ్యాక్టరీకి తరలిస్తుంటే అందులోనూ కేజీ కి ఇంత డబ్బు కావాలని కూటమి పార్టీ నాయకులు బ్లాక్ మెయిల్ చేస్తున్నారని అన్నారు. చెప్పిన విధంగా కమిషన్ ఇవ్వక పోతే పోలీసులకు చెప్పి వాహనాలను సీజ్ చేస్తున్నారని రాత్రి కూడా ఓ వాహనాన్ని స్టేషన్కు తర లించాలని వివరించారు. తెలుగుదేశం పార్టీలో ఉన్న కొట్నూరు చెందిన మాజీ కౌన్సిలర్ మల్లికా ర్జున రెండున్నర ఎకర చెరువు భూమిని కబ్జా చేసి మామిడి తోట పెట్టాడని స్పష్టం చేశారని అన్నారు. ఇదే తరహాలో ఇందిరమ్మ కాలనీలో తిరుపతి నాయుడు అనే టిడిపి వ్యక్తి ఐదు సెంట్లు స్థలం తనకు ఉందని చెబుతూ దా ని వెనుక మరో 15 సెంట్లు జాగా కబ్జా చేయాలని ప్రయత్ని ంచాడని, వైసీపీ ఆందోళనలు చేస్తుందని హెచ్చ రిస్తే విరమించు కున్నాడని చెప్పారు. ఇలాంటి ఉదాహరణలు కోకొ ల్లలు గా ఉన్నాయని పురం ప్రజలకు అధికార పార్టీ వాళ్లు మేలు చేయలే కానీ కీడు చేయవద్దని వేడుకుంటున్నాను అన్నారు.

# సీఎం సహాయ నిధుల చెక్కుల పంపిణీ


ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జూన్ 26 ప్రభాతవార్త

నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరు అయిన ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ శుక్రవారం స్థానిక రోడ్లు, భవనాల అతిథి గృహంలో పంపిణీ చేశారు. 22 మంది లబ్దిదారులకు రూ.18,55,509లను చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగ ఆఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాటా ్లడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ వ్యాప్తంగా 594 మంది లబ్దిదారులకు మొత్తం రూ.5,08,37,998 ఇప్పటి వరకు అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేద కుటుంబాలకు పెద్ద ఊరట - ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి


సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి టౌన్, జూన్ 26, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటోందని పుట్టపర్తి నియోజవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. శుక్రవారం పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి నియోజకవర్గానికి చెందిన 33 మంది లబ్దిదారులకు మొత్తం రూ.20,86,536 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలకు అండగా నిలుస్తూ కష్టకాలంలో ఆదుకుంటున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజ లకు ఆపద్బాంధవుడని కొనియాడారు. కష్టాల్లో ఉన్నప్పుడు సాయం చేసిన వ్యక్తిని ప్రభుత్వాన్ని ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకోవాలని అన్నారు. గత రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో పుట్ట పర్తి నియోజకవర్గంలో మొత్తం 431 మంది లబ్ధిదారులకు రూ. 4.12 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందజేసి పేద కుటుంబాలను ఆదుకున్నామని ఎమ్మెల్యే తెలిపారు. భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభు త్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని పేర్కొ న్నా రు. ఈ కార్యక్రమంలో ప్రజాప్ర తిని ధులు సహకార సొసైటీ అధ్యక్షులు విజయకుమార్, సామకోటి ఆదినా రాయణ, శ్రీరామ్ నాయక్ కూటమి నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.